PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 269 | విజయవాడ, మంగళవారం 2 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 2 May 2023 | Rs

ప్రత్యామ్నాయ ప్రజానుకూల విద్యా విధానం

- రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇవ్వాలి
- 'సేవ్ ఎడ్యుకేషన్, సేవ్ నేషన్' నినాదంతో నేషనల్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ

లోపలి పేజీలో..



మేడే సందర్భంగా కార్మికులు, ఉద్యమకారులు సమ్మెలు, మార్చ్‌లు, ర్యాలీలతో బ్రిటన్ హోరెత్తింది. వేతనాల పెంపు, జాతీయ హెల్త్ సర్వీస్ రెక్కలు విరిచేస్తున్న ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా నర్సులు మరోసారి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. పై నుంచి కిందివరకు అన్ని రంగాల్లోను ఉద్యోగుల్లో నెలకొన్న ఆగ్రహానికి ఈమేడే మార్చ్‌లు, ర్యాలీలు దర్పణం పట్టాయి.



ముస్తాబాద్‌లో మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతు

పలు జిల్లాల్లో కుండపోత

వరి, మొక్కజొన్న, పసుపు, మిరపకు తీవ్ర నష్టం

రైతులను నిండా ముంచిన వర్షాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం కుండపోత వర్షాలు పడ్డాయి. ఈదురు గాలులు వీచాయి. కళ్లాల్లో ఎండబెట్టిన, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వరి, మొక్కజొన్న, మిరప, పసుపు తడిచిపోయాయి. చేతికి అందివచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, ఆలమూరు మండలాల్లో కురిసిన వర్షానికి వరి చేలు నేలకొరిగాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. కె.గంగవరం మండలంలో నేలకొరిగిన వరి చేలను, తడిసిన ధాన్యపు రాశులను మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరిశీలించారు. యానాంలో కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాల్లో మోకాల్లోతు వర్షపు నీరు చేరింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, జగ్గంపేట, సామర్లకోట, కాకినాడలో భారీ వర్షం కురిసింది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో కురిసిన వర్షానికి, ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం, రాజానగరం, తాళ్లపూడిలో భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో వర్షాలు, ఈదురు గాలులకు వరి పైరు నేలనంటింది. పాలకొల్లు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, జీలుగుమిల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ధాన్యపు రాశుల చుట్టూ నీరు చేరడంతో ఆ నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఏలూరు జిల్లా భీమడోలులో రవాణాకు సిద్ధం చేసిన ధాన్యంతో పాటు, అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం రాశులు తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉంగుటూరు, పెదపాడు, ఏలూరు టౌన్, ఏలూరు రూరల్, పెదవేగి, లింగపాలెం, నూజివీడు, ముసునూరు, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది.

పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి, కోసి ఆరబోసిన మిగతా 2లో

కార్పొరేట్-మతతత్వ పాలన

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకూ పోరాటం ● మేడే, ప్రచార భేరి ముగింపు సభలో ఎంఎ బేబి, కె నారాయణ

ప్రజాశక్తి- ప్రతినిధి నెల్లూరు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులకు ప్రతినిధిగా వ్యవహరిస్తూ వాటికి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతున్నారని, సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు పోరాటం సాగించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. 'మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి, దేశాన్ని కాపాడాలి' అంటూ గత నెల 14 నుంచి 30 వరకు నిర్వహించిన ప్రచార భేరి ముగిసింది. ఈ సందర్భాన్ని, మేడేని పురస్కరించుకొని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నెల్లూరులో సోమవారం భారీ ర్యాలీ, బహిరంగ సభ జరిగాయి. బహిరంగ సభలో ఎంఎ బేబి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వంలో కార్మికులు, కర్షకులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. కేరళలోని పేపర్ మిల్లును ప్రయివేటీకరించడానికి ప్రయత్నిస్తే, దానిని కేరళ ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. కేరళలోని విమానాశ్రయాన్ని ప్రయివేటీకరించడానికి ప్రయత్నిస్తే తామే కొనుగోలు చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా కేంద్రం వినలేదన్నారు. ఎపిలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తుండడం శోచనీయమన్నారు. చికాగో నగరంలో కార్మిక పోరాట ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మోడీ ప్రభుత్వం జిఒలతో కాలరాస్తోందని విమర్శించారు. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి పని గంటలను 12 గంటలు చేస్తే, కార్మికులు సంఘటితంగా తిప్పికొట్టారన్నారు. పాలకులకు విన్నపాలు వినపడవని, పోరాటాల ద్వారానే సాధించుకోవాలని అన్నారు.



నెల్లూరు బోసుబొమ్మ సెంటర్ నుంచి నిర్వహించిన భారీ ర్యాలీ, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎంఎ బేబి, చిత్రంలో కె నారాయణ, వి శ్రీనివాసరావు తదితరులు

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కాకుండా 30 మంది కార్పొరేట్ శక్తుల కోసం మోడీ పనిచేస్తున్నారని విమర్శించారు. వీరిలో ఒక్క విజయ్‌మాల్యా మినహా అందరూ గుజరాత్‌కు చెందిన మోడీ మిత్రులేనన్నారు. అదానీకి దేశంలోని పోర్టులు, విమానాశ్రయాలు, మైన్స్ మొత్తం కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు భారీగా పెంచి సామాన్యుల జీవితాలు అతలాకుతలం చేశారని విమర్శించారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి దేశ సరిహద్దులో సమస్యలు సృష్టించి, మతోన్మాదం రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడవడంతోపాటు సిబిఐ, ఎన్నికల సంఘం, కోర్టులను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని అన్నారు. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలను తీవ్రంగా మోసగిస్తోందని విమర్శించారు. కేసుల నుంచి బయటపడడానికే మోడీకి జగన్ దాసోహం అయ్యారని ఆరోపించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మేడే దీక్షా దినమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో మోడీ ప్రభుత్వాని సాగనంపుతామని, దేశాన్ని రక్షించడానికి ప్రచారభేరి నిర్వహించామన్నారు. ఇప్పటికే ఎనిమిది సంవత్సరాలు మోడీని భరించామని, ఇక ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. దేశంలో ప్రతిపక్షాలకు మాట్లాడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారని విమర్శించారు. కేరళకు చెందిన సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌కు నోటీసులు జారీ చేశారన్నారు. ప్రపంచమంతా మేడే జరుపుకుంటోందని, మేడే సందర్భంగా కార్మికులకు మోడీ కనీసం శుభాకాంక్షలు చెప్పలేదన్నారు. ఢిల్లీలో రెజ్లర్లు ఎనిమిది రోజులుగా పోరాడుతున్నా రాష్ట్రపతి, ప్రధాని స్పందించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో బిజెపికి ఏమీ లేదని చెబుతున్నారని, వైసిపి, టిడిపి, జనసేన ప్రాణం పోస్తున్నాయని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు ఇక్కడ కుస్తీపడుతూ ఢిల్లీ వెళ్లి దోస్తీ చేస్తున్నారన్నారు. బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య అధ్యక్షత వహించారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీ

- రక్తహీనత, పౌష్టికాహార లేమిని నివారించాలి
- సమీక్షలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీని వెంటనే చేపట్టేందుకు రిక్రూట్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైన మేరకు ఉండాల్సిన డాక్టర్లు, నర్సులు, ఇతరత్రా సిబ్బంది ఎక్కడ ఖాళీగా ఉన్నా వాటిని గుర్తించి వెంటనే భర్తీ చేయాలని సిఎం ఆదేశించారు. సరిపడా సిబ్బంది ఉంటే సగం సమస్యలు తొలగిపోతాయన్నారు. మౌలిక సదుపాయాలు, మందులు కూడా సరిపడా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రతి సమీక్షా సమావేశంలో కూడా సిబ్బంది ఎంతమంది ఉన్నారు? ఎన్ని ఖాళీలు ఉన్నాయనే అంశంపై వివరాలు సమర్పించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైద్యారోగ్యశాఖపై సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కడా కూడా సిబ్బంది లేరనే మాట రాకూడదని, క్రమం తప్పకుండా ప్రభుత్వాస్పత్రుల్లో ఆడిట్ చేయాలన్నారు. ప్రతి ఆస్పత్రిని ఒక యూనిట్‌గా తీసుకుని ఆడిట్ చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని, గ్రామానికి వెళ్లిన తర్వాత వైద్యుడు ఏమి చేయాలనే దానిపై నిర్దేశించుకున్న ఎస్ఓపి కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వచ్చేముందు ఎప్పుడు వస్తున్నారన్న దానిపై ముందుగానే తేదీలు ప్రకటించాలని, ఆయా తేదీలను ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎమ్‌ల ద్వారా గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా చేయాలని సిఎం పేర్కొన్నారు. అలాగే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయాలని, ఎవరికి సమస్య ఉన్నా వారికి వెంటనే పరీక్షలు చేయాలని, అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, రక్తహీనత, పౌష్టికాహార లేమిని పూర్తిగా నివారించాలని అధికారులను సిఎం ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను విధి నిర్వహణలో సుశిక్షితులుగా తయారు చేయడానికి ప్రత్యేక కరిక్యులమ్ తయారు చేయాలని ఆయన సూచించారు. ఓరల్ హెల్త్ కేర్, ఇఎన్‌టి సమస్యలు, వృద్ధాప్యంలో వచ్చే సమస్యలకు వైద్యసేవలు, సిపిఆర్ లాంటి ఎమర్జెన్సీ మెడికల్ సేవలు సహా వీటన్నింటిపైనా శిక్షణ ఇప్పించాలని అధికారులను సిఎం కోరారు. కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిల్లో నాడు-నేడు పనులపై కూడా సిఎం సమీక్షించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఉన్నతాధికారులు ఎమ్‌టి కృష్ణబాబు, కెవివి సత్యనారాయణ, జె నివాస్, ఎంఎన్ హరీందర్ ప్రసాద్, డి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, వి రామిరెడ్డి, ఆర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ బి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఒక డిఎ మంజూరు

- జీఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2022 జనవరి 1నుంచి ఇవ్వాల్సిన డిఎను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెంబరు 66 67లను విడుదల చేసింది. జీఓ ఎంఎస్ నెంబరు 66ద్వారా ఉద్యోగులకు డిఎ మంజూరు చేయగా, జీఓ ఎంఎస్ నెంబరు 67 ద్వారా పెన్షనర్లకు డిఆర్ 2.73శాతం మంజూరు చేశారు. కొత్త డిఎను 2023 జూలై 1నుంచి జీతంతో కలిపి ఉద్యోగులకు ఇవ్వనున్నారు. జనవరి 2022 నుంచి 2023 జూన్ వరకు ఇవ్వాల్సిన డిఎ బకాయిలను 2023 సెప్టెంబరు, డిసెంబరు, 2024 మార్చి నెలల్లో మూడు సమాన వాయిదాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లిస్తారు. ఇప్పుడు ఇవ్వనున్న కొత్తడిఎతో కలిపి ఉద్యోగుల మొత్తం డిఎ 22.75శాతం కానుంది.

ఐదేళ్లలో 1.4 కోట్ల ఉద్యోగాలు ఫట్

- టెక్నాలజీ రంగంలో కష్టకాలమే
- డబ్ల్యుఇఎఫ్ నివేదిక

లోపలి పేజీలో..

సౌదీలో చర్చలకు సూడాన్ సైన్యం సిద్ధం

- ఐరాస

కైరో : సౌదీ అరేబియాలో చర్చలు జరిపేందుకు సూడాన్ ఆర్మీ, పారామిలిటరీ దళాల అధిపతులిరువురూ అంగీకరించారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన ఉన్నతాధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. సౌదీ అరేబియాలో చర్చలకు తమ ప్రతినిధులను పంపడానికి సూడాన్ సైన్యంలో జనరల్స్ సిద్ధంగా ఉన్నారని ఐరాస అధికారి వోల్కర్ పెర్థెస్ తెలిపారు. ఈ చర్చలు జాతీయ, అంతర్జాతీయ పరిశీలకుల పర్యవేక్షణలో 'స్థిరమైన- విశ్వసనీయమైన' కాల్పుల విరమణ లక్ష్యంగా సాగుతాయని వోల్కర్ చెప్పారు. అయితే ఈ చర్చల అంశం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందన్నారు. దీనిని సూడాన్ సైన్యం ధ్రువీకరించింది. అయితే, సైన్యంతో పోరాడుతున్న పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా రాలేదు. సూడాన్‌లో ఈ రెండు పక్షాల మధ్య ఏప్రిల్15న మొదటిసారి సాయుధ ఘర్షణ తలెత్తింది, ఈ ఘర్షణలో 530 మంది అమాయక పౌరులు మరణించారు. ఇది అంతర్యుద్ధ రూపం తీసుకున్న తరువాత శాంతి చర్చలకు సానుకూలమైన సంకేతం వెలవడ్డం ఇదే మొదటిసారి. ఈ రెండు పక్షాలు కాల్పుల విరమణను మరో మూడు రోజులు పొడిగించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లోనే ఇది ప్రభావం చూపిస్తోంది.కాల్పుల విరమణను మరో 72 గంటలు పొడిగిస్తున్నట్లు ఇరు పక్షాలు ఆదివారం రాత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే.

సోమవారం రాజధాని ఖర్తూమ్ దాని సమీప నగరం ఓమ్ దుర్మాన్‌లో పేలుళ్లు, కాల్పులు ప్రతిధ్వనించాయని నివాసితులు చెప్పారు. దీని గురించి వోల్కర్ మాట్లాడుతూ కాల్పుల విరమణ ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలుస్తోందని, కాల్పుల విరమణను పర్యవేక్షించడానికి సూడాన్ అధికారులు, విదేశీ పరిశీలకులు కలిగి ఉన్న ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

'దేశద్రోహం'పై చర్చిస్తున్నాం



- పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు సుప్రీంకు వివరిస్తాం
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం
- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టే అవకాశం!
- ఆగస్టు రెండో వారానికి కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బ్రిటీష్ కాలం (152 ఏళ్ల) నాటి దేశద్రోహం చట్టాన్ని పునఃపరిశీలించడంపై చర్చలు కీలక దశలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దేశద్రోహ చట్టాన్ని సవాల్ చేస్తూ ఎడిటర్స్ గిల్డ్, మేజర్ జనరల్ (రిటైర్డ్) ఎస్‌జి వొంబత్కరే, మాజీ కేంద్ర మంత్రి అరుణ్ శౌరి, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) సహా మొత్తం16 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. దేశద్రోహాన్ని నేరంగా పరిగణించే భారత శిక్షాస్మృతి (ఐపిసి)లోని సెక్షన్ 124ఏను పునఃపరిశీలించే అంశంపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని ధర్మాసనానికి అటార్నీ జనరల్ (ఎజి) ఆర్. వెంకటరమణి తెలిపారు. ఈ ప్రక్రియ చివరి దశలో ఉందని, పార్లమెంటుకు వెళ్లే ముందు దానిని తనకు చూపుతామని అన్నారు. "పార్లమెంటు వర్షాకాల సమావేశాల తరువాత ఈ అంశాన్ని తదుపరి విచారణకు దయచేసి వాయిదా వేయండి" అని ఆయన ధర్మాసనాన్ని కోరారు. సవరించిన చట్టాన్ని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అందువల్ల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తరువాత ఆగస్టు రెండో వారానికి ఈ కేసు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

పిటిషనర్లలో ఒకరి తరపున సీనియర్ న్యాయవాది అరవింద్ దాతార్ వాదనలు వినిపిస్తూ 1962లో కేదార్ నాథ్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ నిబంధనను సమర్థించినందున ఈ అంశాన్ని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించాల్సిన అవసరాన్ని కోర్టు పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కూడా ఆ వాదనను సమర్థించారు. ఆర్టికల్ 19ని కొత్త రూపంలో పునర్నిర్మించాల్సి ఉందని, అందుకే ఈ కేసు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వెళ్లాలని అన్నారు. పిటిషనర్లలో ఒకరైన ఎస్‌జి వొంబత్కరే తరపు న్యాయవాదులు పిబి సురేష్, ఎస్ ప్రసన్న అటువంటి సూచనను వ్యతిరేకించారు. ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ, ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు ఉంచాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అనంతరం ఏజి వెంకటరమణి వాదానలు వినిపిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు ప్రభుత్వం సుప్రీం కోర్టుతో సంప్రదింపులు జరుపుతుందన్నారు. "124ఎని పునఃపరిశీలించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. సంప్రదింపులు చివరి దశలో ఉన్నాయని ఎజి పేర్కొన్నారు. ఈ ప్రకటన, ఎజి అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని, మేము ఈ కేసు విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది.

దేశద్రోహ చట్టాన్ని నిలుపుదల చేస్తూ 2022 మే 11న అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఐపిసి సెక్షన్ 124ఎ ప్రకారం మిగతా 5లో

14 మొబైల్ మెసెంజర్ యాప్‌లపై నిషేధం

న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్‌లోని ఉగ్రవాదులకు పాకిస్తాన్ నుంచి కోడెడ్ సందేశాలు పంపేందుకు వాడుతున్న 14 మొబైల్ మెసంజర్ యాప్‌లపై కేంద్రం నిషేధం విధించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ సిఫార్సుల మేరకు తీవ్రవాద కార్యకలాపాల అణచివేతలో భాగంగా గూగుల్ ప్లే, యాప్ స్టోర్ వంటి మార్కెట్ ప్లేస్‌ల నుంచి వాటిని తొలగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేంద్రం నిషేధం విధించిన వాటిలో క్రిప్‌వైజర్, ఎనిగ్మా, సేఫ్‌వైజ్, వికర్మి, బ్రియార్, బీఛాట్, నాండ్‌బాక్స్, కొనియాన్, ఐఎంవో, ఎలిమెంట్, సెకండ్ లైన్, జంగీ, త్రిమా ఉన్నాయి. దేశంలోని భద్రతా సంస్థలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. "కాశ్మీర్‌లోని క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కదలికలు, వారి సమాచార మాధ్యమాలపై ఏజెన్సీలు దృష్టిపెట్టాయి. కొన్ని యాప్స్‌నకు దేశీయంగా ఒక్క ప్రతినిధి కూడా లేని విషయం బయటపడింది. ఇలాంటి వాటిల్లో జరిగే కార్యకలాపాలను గుర్తించడం చాలా కష్టం" అని ఓ అధికారి వెల్లడించారు. జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించే, భారత చట్టాలను పాటించని యాప్‌ల జాబితాను సిద్ధం చేసి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000లోని సెక్షన్ 69 ఎ కింద బ్లాక్ చేసినట్లు తెలిపాయి.

తుని రైలు దగ్ధం కేసు కొట్టివేత

ముద్రగడ, మంత్రి దాడిశెట్టితో పాటు మరో 39 మందికి ఊరట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన తుని రైలు దగ్ధం కేసును విజయవాడ రైల్వే కోర్టు సోమవారం కొట్టివేసింది. దర్యాప్తు అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న 41 మందిని రైలు దగ్ధం కేసులో నిందితులుగా నిరూపించలేకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారతీయ రైల్వేకు చెందిన రైలు తగులబెట్టిన కేసులో సీరియస్‌గా ఆర్‌పిఎఫ్ పోలీసులు దర్యాప్తు చేయకుండా తూతూ మంత్రంగా చేయడం పట్ల కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. 2016లో కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఈ క్రమంలో ఆందోళనకారులు తుని వద్ద రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును తగులబెట్టారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం 69 కేసులను నమోదు చేసింది. ఆయా కేసులను వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రైలు దగ్ధం కేసుకు సంబంధించి నిందితులుగా పేర్కొన్న 41 మందిలో ఎ-1గా ముద్రగడ పద్మనాభం, ఎ-2గా ఆకుల రామకృష్ణ, ఎ-3గా ప్రస్తుతం రహదారులు, భవనాలశాఖ మంత్రిగా పనిచేస్తున్న దాడిశెట్టి రాజా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి 24 మంది సాక్షులు ఉండగా, వీరిలో 20 మంది కోర్టు విచారణకు హాజరయ్యారు. ఇందులో ఐదుగురు తమకేమీ తెలియదని సాక్ష్యం చెప్పారు. దర్యాప్తు సక్రమంగా చేయలేదంటూ కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో ముగ్గురు దర్యాప్తు అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించింది.

అసలు దోషులెవరు?

దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన తుని రైలు దగ్ధం కేసులో పేర్కొన్న వారందరూ దోషులు కారని విజయవాడ రైల్వే కోర్టు తీర్పుచెప్పిన నేపథ్యంలో నిజంగా రైలు తగులబెట్టిన వారెవరన్నది ప్రజల్లో చర్చ జరుగుతోంది. అసలైన నిందితులను గుర్తించడంలో ఆర్‌పిఎఫ్ పోలీసు అధికారులు ఎందుకు విఫలమయ్యారనే ప్రశ్న ఉద్భవిస్తోంది.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- సిఎస్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేసిన ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణ తరహాలో కాంట్రాక్టు ఉద్యోగులందరినీ మన రాష్ట్రంలో కూడా రెగ్యులర్ చేయాలని ఎపి జెఎసి అమరావతి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డిని జెఎసి నాయకులు కలిసి మూడో దశ ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. అనంతరం ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి మళ్లీ ఉద్యమ కార్యాచరణ మొదలవుతుందని, ప్రాంతీయ సదస్సులు నిర్వహించబోతున్నట్లు సిఎస్‌కు తెలిపామన్నారు. గత నెల 27న మంత్రివర్గ ఉపసంఘంతో జరిపిన చర్చల్లో సానుకూలంగా స్పందించిన అంశాలపై సిఎస్‌కు వివరించినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆర్థికేతర సమస్యలపై అధికారులతో మాట్లాడాలని తాము చెప్పినట్లు బొప్పరాజు వెల్లడించారు. ఈ నెల 30న ఉద్యోగుల సమస్యలపై సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమం చేపడతామన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


అకాల వర్షాలకు అపారంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరి జిల్లాల్లో ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల తడిసి ముద్దయిపోతున్నాయని తెలిపారు. తీవ్రమైన గాలులు, వర్షపు జల్లులకు రైతులు ప్రాణం గుప్పెట పెట్టుకుని పరుగులు తీస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కళ్లాల్లోని మిరప, జొన్న, మొక్కజొన్న, పొగాకు పంటలను కొనుగోలు చేసేందుకు వెంటనే మార్కెట్ పాయింట్లు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. మరో రెండు రోజులు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి రైతులకు సహాయపడాలని సూచించారు. ఇటీవల కురిసిన వానల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇప్పటివరకు ప్రభుత్వం పరిహారం అందించలేదని తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలు, భూవిస్తీర్ణం నమోదు చేసి గుర్తించిన రైతుల పేర్లు ప్రకటన చేయడంలో స్పష్టత లేదని పేర్కొన్నారు. నష్టపోయిన రైతుల వివరాలు ప్రకటించి ఆర్థికంగా సహకారం అందించే భరోసా ఇవ్వడం లేదని తెలిపారు.

ఎస్‌సిల సంక్షేమంలో రాష్ట్రమే ముందు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సిల సంక్షేమంలో రాష్ట్రమే ముందుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. సచివాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు కలిపి 1.11 లక్షల ఎస్‌సి కుటుంబాలకు సాయం చేశాయని తెలిపారు. రాష్ట్రంలోనే 33.57 లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సాయం చేసిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ గణాంకాలు ఎస్‌సిల అభివృద్ధి పట్ల సిఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో ఎస్‌సిలకు రూ.33,625 కోట్లు ఖర్చు పెడితే, తమ ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.58,353 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. రాష్ట్రంలో ఎస్‌సిల సంక్షేమంపై చంద్రబాబుతో తాను బహిరంగ చర్చకు సిద్ధమన్నారు.



డిసిఐఎల్‌కు రూ 172.22 కోట్ల కాంట్రాక్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐఎల్) విశాఖపట్నం మరో మైలు రాయిని దాటింది. పరదీప్ పోర్టు నుంచి రూ.172.22 కోట్ల కాంట్రాక్టును తాజాగా దక్కించుకుంది. డిసిఐ 2017 తర్వాత దేశంలోని నాలుగు మేజర్ పోర్టులైన విశాఖపట్నం, పరదీప్, జెఎన్‌పిటి, దీన్‌దయాల్ పోర్టుల మెజారిటీ వాటా 73.47 శాతంతో ప్రభుత్వ పోర్టుల నిర్వహణలో నడుస్తోన్న విషయం తెలిసిందే. మేజర్ పోర్టుల, రక్షణ రంగ అవసరాలను తీర్చడంలోనూ, ఫిషింగ్ హార్బర్‌లు, మెరైన్ సదుపాయాల కల్పనలోనూ డిసిఐఎల్ కీలకపాత్ర పోషిస్తోంది. మేజర్ పోర్టుల ఎగ్జిమ్, సురక్షితమైన ఛానెల్ నేవిగేషన్ కార్యకలాపాల నిర్వహణలోనూ డిసిఐఎల్ కీలక ప్రభుత్వ రంగ సంస్థగా వెలుగొందుతోంది. పరదీప్ పోర్టు ద్వారా పొందిన కాంట్రాక్టు ప్రకారం అక్కడ అప్రోచ్ ఛానెల్, ఎంట్రన్స్ ఛానెల్, టర్నింగ్ సర్కిల్, డాక్స్, ఇసుక ట్రాపింగ్ వంటి పనుల కోసం రూ.172.22 కోట్లు మేర ఆర్డర్‌ను 2023-24కు దక్కించుకోవడం విశేషం. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న రూ. వెయ్యి కోట్ల టర్నోవర్ వైపునకు డిసిఐఎల్ శరవేగంగా అడుగులు వేస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.



విశాఖ నగరంలో వందలాది మందితో సాగుతున్న మేడే ర్యాలీ



అనంతపురంలో కార్మికుల ర్యాలీ



విజయవాడలో మాట్లాడుతున్న నర్సింగరావు

రెపరెపలాడిన అరుణ పతాకం

- రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా మేడే వేడుకలు
- మరో పోరాటానికి సిద్ధం కావాలి : నేతలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా ఎరుపు జెండా రెపరెపలాడింది. మేడే సందర్భంగా సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జోరు వర్షంలోని ర్యాలీలు, పతాకావిష్కరణలు చేపట్టారు. వేలాది మంది కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల ఫలాలను స్మరించుకున్నారు ప్రస్తుతం కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వంపై మరో పోరాటానికి కార్మికవర్గం సిద్ధం కావాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు.

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 300 సెంటర్లలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. విజయవాడ పడమటలో నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు మాట్లాడుతూ..పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈ రోజు నాలుగు లేబర్‌కోడ్‌లుగా కేంద్రం మార్చిందన్నారు. మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని కోరారు. కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చిన ప్రభుత్వాలు గద్దెనెక్కిన తర్వాత ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని విమర్శించారు. రాణిగారి తోట, కృష్ణలంకలో నిర్వహించిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. అనంతపురంలో మున్సిపల్ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా కృష్ణకళా మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ..కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక సంరక్షణ చట్టాలను కేంద్రం ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. శ్రమదోపిడి, వెట్టిచాకిరీలోకి వారిని నెట్టివేస్తోందని ధ్వజమెత్తారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని పార్టీలు ప్రజావ్యతిరేక మోడీవైపు ఉంటాయో..రాష్ట్ర అభివృద్ధి వైపు ఉంటాయో తేల్చుకోవాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, తణుకులో జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పాల్గొని మాట్లాడారు. కార్మిక హక్కులు, చట్టాలపై మోడీ ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఈ సమస్యకు పరిష్కారమని తెలిపారు. కార్మిక చట్టాలు లేకపోతే కార్మికులు మళ్లీ బానిసలుగా బతికే రోజులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు రాయితీలు, శ్రమ జీవులపై భారాలు మోపే బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు.కర్నూలులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర నాయకులు పి.నిర్మల పాల్గొని, మాట్లాడారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. పెరిగిన ధరలను అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జోరు వర్షంలోనూ తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలో వేడుకలు నిర్వహించారు. కాకినాడలో సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి పాల్గొన్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం ప్రజాశక్తి ప్రింటర్స్ భవనం వద్ద వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేశారు. ఎడిటర్ తులసీదాస్ మాట్లాడారు. అంతర్జాతీయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న తీరును వివరించారు. సిజిఎం అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు. పల్నాడులో కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 30 మండలాల్లోనూ పతాకావిష్కరణలు జరిగాయి. విశాఖ జిల్లాలో 350 సెంటర్లలో ఎర్రజెండాలు ఎగురవేశారు. ఉమ్మడి ప్రకాశం,కడప, తిరుపతి, విజయనగరం జిల్లాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

పనిగంటలు 12 కాదు... 8గంటలే : సిపిఎం

విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పతకావిష్కణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులు బలిదానంతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ 12 గంటల విధానాన్ని చట్టసవరణ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.. శ్రమను పిండి అదానీ, అంబానీలకు కట్టబెట్టే మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి మేడేని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరిని ఉద్దేశించి మన్‌కీబాత్ మాట్లాడుతున్నారో ప్రధాని చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాఉద్యమాలపై అనుసరిస్తున్న నిర్బంధ పద్ధతులను ఖండించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కార్మికవర్గం ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. విశాఖ స్టీలు ప్లాంటును పరిరక్షించుకునేందుకు ఈ నెల 3న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాస్తారోకోలు, ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మల్యాద్రి, జయరామ్, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సరిహద్దు జిల్లాల్లో 45 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటకలో ఈ నెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణా చేయకుండా నియంత్రించేందుకు రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో మొత్తం 45 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనరు రాజీవ్‌కుమార్ సహచర కమిషనర్లు గోయల్, పాండేతో కలిసి కర్ణాటకతో సరిహద్దు కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, డిజిపి, సిఇఒ ఇతర సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంతో సరిహద్దు కలిగిన జిల్లాల్లో పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బందితో కూడిన 45 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా చెక్‌పోస్టుల ద్వారా ఇప్పటి వరకు 3,008 లీటర్ల అక్రమ ఐఎంఎఫ్ఎల్ లిక్కర్‌ను ఒక్కొక్కటి 90 మిల్లీ లీటర్లు కలిగిన 444 టెట్రా ప్యాక్‌లను, రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఈ సందర్భంగా డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ,సిఇసి రాజీవ్‌కుమార్ మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా, ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, హోమ్‌శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, గ్రేహౌండ్స్ అదనపు డిజిపి ఆర్‌కె మీనా, ఎస్ఇబి డైరెక్టర్ ఎం.రవిప్రకాష్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.



చిలకలూరిపేట సభలో మాట్లాడుతున్న పి మధు

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు ముప్పు

- దళితుల భూములకు రక్షణ కల్పించాలి
- చిలకలూరిపేటలో మాజీ ఎంపి మధు

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు తగ్గిపోయాయని మాజీ ఎంపి పి.మధు అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో భూ సమస్యలపై సిఐటియు, కెవిపిఎస్, వ్యవసాయకార్మిక సంఘం, భూ హక్కులపోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సభలో మధు పాల్గొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ.. చిలకలూరిపేట నియోజకవర్గంలో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, లేదంటే భూములను దున్నేస్తామని హెచ్చరించారు. వర్షాలు పడిన వెంటనే యడవల్లి దళితుల భూములను సాగు చేస్తామని తెలిపారు. గ్రానైట్ పేరుతో యడవల్లి, మురికిపూడి గ్రామాల్లో సాగు చేస్తున్న దళితుల భూములను ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు మంత్రి విడుదల రజిని అప్పగించిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విశాఖకు రైల్వేజోన్ ప్రకటించకపోవడం, విశాఖ ఉక్కు ప్రయివేటీకరించడం వంటివి మోడీ దుర్మార్గాలకు ఉదాహరణ అని చెప్పారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా బిజెపికి సిఎం జగన్ వత్తాసు పలకడం శోచనీయమన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో పేదల స్థితిగతులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజధానిలో టిడ్కో ఇళ్ల వివరాలివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ఏరియాలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారుల, ఇళ్ల కేటాయింపులు వంటి వివరాలు నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మౌఖికంగా ఆదేశించిన హైకోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశించింది. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 1134 ఎకరాల్ని గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు బదలాయింపునకు సిఆర్‌డిఎకు రాష్ట్రం అనుమతిస్తూ జిఒ 45 వెలువరించింది. దీనిని సవాల్ చేసిన పలు కేసులను గతంలో విచారించిన హైకోర్టు గత నెల 21న తీర్పును రిజర్వు చేసింది. ఆర్-5 జోన్‌లో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చేస్తోందంటూ రైతుల తరపున న్యాయవాది సూరపనేని సంజయ్ హైకోర్టు సిజెకు లేఖ రాశారు. దీనిపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. పై వివరాల పరిశీలన కోసం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే

విద్యా హక్కు చట్టం ప్రకారం 2023-24 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వాళ్ల పిల్లలకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్న గత ఉత్తర్వుల్ని అమలు చేసి తీరాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చి చెప్పింది. 2022 జనవరిలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు జరగకపోతే సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. గత ఉత్తర్వులు అమలు చేయలేదని యోగేష్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసి, విచారణను జూన్ 27కు వాయిదా వేసింది.

ఉద్యోగ సంఘం గుర్తింపు రద్దు నోటీసుపై స్టే

వాణిజ్య పన్నులశాఖ సర్వీస్ అసోసియేషన్ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసు అమలును హైకోర్టు నిలిపివేసింది. జిఎడి ఇచ్చిన నోటీసుపై జస్టిస్ డి రమేష్ స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలిచ్చారు. సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన షోకాజ్ నోటీసును సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ సవాల్ చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని జిఎడిని ఆదేశించారు. విచారణను ఈ నెల 29కు వాయిదా వేశారు.

వైసిపి కేంద్ర కార్యాలయంలో మేడే వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కార్మికులకు దుస్తులు, మిఠాయిలు పంచారు. పార్టీ పేరులోనే శ్రామికులను చేర్చిన ఘనత తమ పార్టీదని అప్పిరెడ్డి అన్నారు.

గ్రామ వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా

గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్‌గా (అదనపు బాధ్యతలు) గృహ నిర్మాణ సంస్థ ఎండి లక్ష్మీశా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం సమర్థవంతంగా అమలవడానికి గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

'ఉపాధి హామీ' బకాయిలు చెల్లించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ కార్మికుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌కు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి సోమవారం లేఖ రాశారు. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. కుటుంబానికి 100 రోజులు పని కల్పించాల్సి ఉండగా, రాష్ట్రంలో ప్రతిఏడాదీ సగటున 50 రోజులకు మించి పని కల్పించడం లేదని తెలిపారు. కొన్ని కుటుంబాలకు 25 నుంచి 30 రోజులే కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 32 లక్షల కుటుంబాలకు పని కల్పించినందుకు రూ.481 కోట్ల వేతనాలు ఇవ్వాలని, ఇప్పటికీ రూ.273 కోట్లు మాత్రమే చెల్లించారని వెల్లడించారు. వేతనాలు వారం వారం చెల్లించాలని చట్టం చెబుతుండగా నెలల తరబడి చెల్లించడం లేదని, పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు.

ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సవరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎపిఎస్ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచుతూ సవరణ చేశారు. ఆర్‌టిసిలో అన్‌స్కిల్డ్ వర్కర్లకు నెలకు రూ.10,603 వుండగా, రూ.11,022లకు పెంచారు. సెమీస్కిల్డ్ వర్కర్లకు రూ.12,523 నుంచి రూ.13,019లకు, స్కిల్డ్ వర్కర్లకు రూ.15,366 నుంచి రూ.15,974లకు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌లకు రూ.11,563 నుండి రూ.12,021లకు, అటెండర్స్‌కు రూ.10,603 నుండి రూ.11,022లకు పెంచారు. సెక్యూరిటీ విభాగంలో కార్పొరేషన్‌లలో పనిచేసే అసిస్టెంట్ సెక్యూరిటీ ఇన్స్‌స్పెక్టర్‌లకు రూ.13,412 నుండి రూ13,844కు, మున్సిపాలిటీలలో రూ.12,412 నుంచి రూ.12,844లకు ఇతర పట్టణాల్లో రూ.11,162 నుండి రూ.11,594లకు పెంచారు. సెక్యూరిటీ గార్డులకు కార్పొరేషన్‌లలో రూ.11,912 నుంచి రూ.12,344లకు, మున్సిపాలిటీలలో రూ.11,162 నుంచి రూ11,594లకు ఇతర ప్రాంతాల్లోని వారికి రూ.10,912 నుండి రూ.11,344లకు పెంచారు. సఫాయి కర్మాచారి వర్కర్లకు కార్పొరేషన్‌లలో రూ.14,113 నుండి రూ.14,654లకు, మున్సిపాలిటీలలో రూ.13,853 నుండి రూ.14,394లకు ఇతర ప్రాంతాల వారికి రూ.13,653 నుండి రూ.14,194లకు పెంచారు. ఈ పెరిగిన వేతనాలు 2023 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఎపిఎస్ఆర్‌టిసి ఉత్తర్వులు జారీ చేసింది.

'విశాఖ ఉక్కు' పోరాటానికి మద్దతు

- విద్యార్థి, యువజన సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఈ నెల 3న చేపట్టనున్న రాస్తారోకోలకు విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంఘాల నేతలు జి రామన్న (డివైఎఫ్ఐ), కె ప్రసన్నకుమార్ (ఎస్ఎఫ్ఐ), ఎన్ లెనిన్‌బాబు (ఎఐవైఎఫ్), జాన్సన్‌బాబు (ఎఐఎస్ఎఫ్), రాజేష్ (పిడిఎస్‌యు), వేముల శ్రీనివాస్ (ఎన్ఎస్‌యుఐ), గనిరాజు (పిడిఎస్‌యు) సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు బిజెపితో అంటకాగుతూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పోరాటంలో తాము ప్రత్యక్షంగా పాల్గొంటామని వెల్లడించారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రాస్తారోకోలు, ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆందోళనల్లో రాష్ట్రంలోని లారీ యజమానులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 3న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ లారీలను ఎక్కడికక్కడే నిలిపివేసి మద్దతు తెలపాలన్నారు.



బాలా త్రిపుర సుందరికి నివాళులు అర్పిస్తున్న సిఎం వైఎస్ జగన్

మల్లాది విష్ణుకు మాతృవియోగం

- కుటుంబ సభ్యులకు సిఎం పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు మాతృవియోగం కలిగింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి బాలాత్రిపురసుందరి విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. విజయవాడ ఎమ్‌జి రోడ్డులోని మల్లాది విష్ణు ఇంటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లి బాలాత్రిపురసుందరికి నివాళులర్పించారు. అనంతరం మల్లాది కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ ఎమ్‌డి రుహుల్లా, ఎపిఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్, జిల్లా కలెక్టరు ఢిల్లీరావు, విఎంసి కమిషనరు స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, నగర పోలీసు కమిషనరు కాంతిరాణాటాటా, రీజనల్ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు, డిఆర్ఒ మోహన్‌రావు, జిజిహెచ్ సూపరింటెండెంటు సౌభాగ్యలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రసాద్, ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ సుధాకర్, తహశీల్దార్లు దుర్గాప్రసాద్, వెన్నెల శ్రీనివాస్, వైసిపి కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, కో-ఆర్డినేటర్లు తదితరులు ఉన్నారు.

జగన్ ముఠా అరాచకాలు తారాస్థాయికి

- టిడిపి అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో వైసిపి నేతల అరాచకాలు తారాస్థాయికి చేరాయని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. భూములు కబ్జాచేయడమే కాకుండా బాధితులకు అండగా నిలబడిన వారిపై అక్రమ కేసులా? అని ప్రశ్నించారు. ఆయన సోమవారం ఒక ప్రకటన చేస్తూ, పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగలగుట్టపల్లెలో కోర్టు వివాదంలో ఉన్న భూమిని వైసిపి నేత సుబ్బయ్య కబ్జా చేశారని ఆరోపించారు. బాధితుల తరపున వెళ్లి అన్యాయాన్ని ప్రశ్నించినందుకు టిడిపి మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, ఇతర నేతలపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. ఆదిరెడ్డి భవానీ కుటుంబసభ్యుల అక్రమ అరెస్టు జగన్ అరాచకపాలనకు పరాకాష్ట అని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు యనమల రామకృష్ణుడు మరో ప్రకటనలో విమర్శించారు. సినీనటులు రజినీకాంత్‌పై వైసిపి నేతలు, మంత్రులు చేసిన వ్యాఖ్యలు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మధ్య వైషమ్యాలు రేకెత్తించే ప్రమాదముందని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతిరైతును, నేలపాలైన ప్రతిపంటను కాపాడాల్సిన బాధ్యత సిఎం జగన్‌దే అని టిడిపి రైతువిభాగం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. బాబాయిని చంపిన వారిని కాపాడటం తన ఉద్యోగం కాదని సిఎం తెలుసుకోవాలని అన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : కళా వెంకట్రావు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని మాజీమంత్రి కళా వెంకట్రావు డిమాండ్ చేశారు. జగన్ లూఠీ, అవినీతి కారణంగా విద్యుత్ వినియోగదారులపై రూ.57,188 కోట్ల భారాలు మోపారని ఆరోపించారు.

తిరుమలలో హై అలర్ట్?

ఫేక్ ఇ-మెయిల్ : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో హై అలర్ట్ కొనసాగుతుంది. తిరుమల కొండపై ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో టిటిడి విజిలెన్స్ ,పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుమల మాఢవీధుల్లో అడుగడుగున పోలీసులు జల్లెడ పడుతున్నారు. సిసిటివి పుటేజీలను పోలీసులు క్షుణంగా పరిశీలిస్తున్నారు. భద్రతను మరింత పటిష్టపరిచారు. తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి విచారించారు. ఈ-మెయిల్ ఫేక్ అని ప్రకటించారు.

కుండపోత

మొదటి పేజి తరువాయి

మొక్కజొన్న, కళ్లాల్లో ఉన్న మిర్చి తడిసిపోయాయి. మాచర్లలో అత్యధికంగా పది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లా వట్టిచెరకూరకూరులో భారీ వర్షానికి మిర్చి తడిసి రంగు మారుతుండడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలులో రహదారులు జలమయ మయ్యాయి.



కోనసీమ జిల్లా కె.గంగవరంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

మొక్కజొన్న తడిసిపోయింది. లంక గ్రామాల్లోని ఇటుక పరిశ్రమకు వర్షంతో తీవ్ర ఆటంకం కలిగింది. కళ్లాల్లో నీరు చేరి పచ్చి ఇటుక కరిగిపోయింది. డెల్టా ప్రాంతంలో సాగవుతున్న మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. కృష్ణా జిల్లాలో పలు ప్రాంతాల్లో మొక్కజొన్న, జొన్న, పసుపు, వరి పంటలు నీట తడిచాయి. వందలాది ఎకరాల్లోని దాళ్వా వరి, మొక్కజొన్న, జొన్న పంటలు నేలవాలాయి. తీరప్రాంతంలో సాగవవుతున్న ఉప్పు నీరుగారింది. పొలాల్లో ఉన్న 23,380 టన్నులు పసుపు తడిచిపోయింది. 1,875 టన్నులు మొక్కజొన్న నీటిపాలైంది. కృష్ణా జిల్లాలో 43.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుడివాడలో 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఎచ్చెర్లలో 83.25 మిల్లీమీటర్ల, ఆమదాలవలసలో 76.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా అంతటా సోమవారం స్వల్ప వర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లాలో అక్కడకక్కడా జల్లులు, నెల్లూరు జిల్లాలో తుంపర్లు పడ్డాయి.

రైతుల కష్టాలు చూడండి

- రజినీకాంత్‌కు సిఎం క్షమాపణ చెప్పాలి
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజకీయ విమర్శలు చేసేముందు రైతుల కష్టాలు చూడాలని సిఎం జగన్‌కు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతాంగం నష్టపోతుంటే ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని సోమవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మంత్రులు కనీసం ఒక్కచోట కూడా రైతుల దగ్గరకు, పొలాల్లోకి వెళ్లడం లేదని అన్నారు. అన్నదాత కష్టాన్ని కనీసం ఆరా తీయడం లేదని, ఇక సిఎం సంగతి సరేసరి అని పేర్కొన్నారు. రజనీకాంత్‌ను తిట్టే పనికంటే, ధాన్యం రైతుల కష్టాలు చూడాలని తెలిపారు. పవన్‌కల్యాణ్‌ను ఆడిపోసుకోవడం మాని మిర్చి రైతుల బాధలు వినండని అన్నారు. పొలంలో అన్నదాతల దుస్థితిపై దృష్టిపెట్టాలని, కర్షకులకు భరోసా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి తగిన సాయం చేయాలన్నారు. రజనీకాంత్‌పై వైసిపి విమర్శలకు సిఎం జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వ పోకడలపై రజనీ చిన్న విమర్శ కూడా చేయలేదన్నారు. రజనీ వంటి వారిపై వైసిపి నేతల నీచ వ్యాఖ్యలు అందరికీ బాధ కల్గిస్తున్నాయని పేర్కొన్నారు.

మేడే శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

శ్రామిక, కార్మిక, కర్షక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు, మీ కష్ట ఫలితమే సమాజ ప్రగతి అని చంద్రబాబు తెలిపారు. అందుకే శ్రమజీవుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో టిడిపి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కష్టానికి విలువ పెరిగే మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు.

4 నుంచి తిరుపతి పర్యటన

ఈ నెల 4 నుంచి చంద్రబాబు తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరగాల్సిన పర్యటన వర్షాల కారణంగా వాయిదా పడింది. టిడిపి చేపట్టిన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా 4న సూళ్లూరుపేట, 5న గూడూరు, 6న వెంకటగిరి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ముగ్గురు డైరెక్టర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు ప్రభుత్వం ముగ్గురు డైరెక్టర్లను నియమించింది. వీరిలో త్రిపురాబొట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ, గున్నంటి వివిఎస్-ఎస్‌బి పూర్ణానందశర్మ, యనమండ్ర సాయి సురేష్‌లు ఉన్నారు. వీరు సోమవారం గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమసంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఎమ్‌డి ఎస్.శ్రీనివాసరావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయశాఖ సలహాదారులు జ్వాలాపురపు శ్రీకాంత్, జనరల్ మేనేజరు జి.నాగసాయి, పురుషోత్తం పాల్గొన్నారు.

కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు భూ కబ్జాకోరులు

బాగేపల్లిలో సిపిఎం అభ్యర్థిని గెలిపించండి : బివి రాఘవులు విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిలమత్తూరు (బాగేపల్లి నుంచి)

కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బాగేపల్లి స్థానం నుంచి పోటీ చేస్తోన్న కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు భూ కబ్జాకోరులని, ఇలాంటి వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బాగేపల్లి నియోజకవర్గం గుడిబండ తాలూకా కేంద్రంలో సోమవారం వేలాది మందితో ర్యాలీ, భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో రాఘవులు మాట్లాడుతూ బాగేపల్లి అసెంబ్లీకి పోటీ చేస్తున్న ఇతర పార్టీ అభ్యర్థులతో పోలిస్తే సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ పేదల డాక్టర్‌గా పేరు పొంది నిత్యం ప్రజాసేవలో ఉంటున్నారని తెలిపారు. బాగేపల్లి ప్రాంత ప్రజలు గత 15 ఏళ్లుగా కాంగ్రెస్, బిజెపిలతో విసిగిపోయారన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని తరగతుల ప్రజానీకం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిపిఎంకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. బాగేపల్లిలో బిజెపికి ప్రజాబలం లేదని, ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టి గెలవాలని చూస్తోందని విమర్శించారు. ఇలాంటి వారికి బుద్ధి చెప్పి సిపిఎం అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు బాగేపల్లి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ, బెంగళూరు నుంచి వచ్చిన బిజెపి అభ్యర్థికి, ఎప్పుడూ తన వ్యాపారంతో బెంగళూరులో ఉండిపోయే కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయడం వల్ల స్థానికులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. సిపిఎంకు ఓటు వేయడం ద్వారా భూ కబ్జాకోరులకు బుద్ధి చెప్పాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. బాగేపల్లిలో శ్రీరామరెడ్డి (సిపిఎం) ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి మినహా ఆ తర్వాత ఇక్కడ ఎటువంటి అభివృద్ధీ జరగలేదన్నారు.

గుడిబండ తాలుకా అభివృద్ధికి ప్రణాళిక

గుడిబండ ప్రాంతం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణను సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ ప్రకటించారు. ప్రచారం సందర్భంగా తాను చాలా విషయాలను గమనించానన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని గుడిబండ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. 15 ప్రధాన హామీలు ఇచ్చారు. తనను గెలిపిస్తే ఈ పనులు కలిసికట్టుగా చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జిల్లా, తాలూకా స్థాయి నాయకులు, జెడిఎస్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాలు, జెడిఎస్ నాయకులు



కెఆర్ పురం నియోజకవర్గంలో బృందాకరత్ విస్తృత ప్రచారం

కర్ణాటకలోని కెఆర్ పురం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి ఎం నంజెగౌడను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యాన సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మేడే నేపథ్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ, బహిరంగ సభకు సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ర్యాలీని ప్రారంభించడంతోపాటు సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ మాట్లాడారు. సభలో అభ్యర్థి నంజె గౌడతోపాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మీనాక్షి సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరనారాయణకు నిరసన సెగ

- వాహనంపై అసమ్మతినేతల దాడి

ప్రజాశక్తి - సోమందేపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణకు సోమవారం మరోసారి నిరసన సెగ తగిలింది. వైసిపి అసమ్మతి నేతలు ఆయన వాహనంపై రాళ్లు విసిరారు. గ్రామసమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని ఆరోపిస్తూ వైసిపి సర్పంచ్ కుమారుడి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గడ్డంనాగేపల్లి గ్రామంలో శంకరనారాయణ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి రేణుకానగర్‌కు వెళ్తుండగా ఈదులబాలాపురం గ్రామస్తులతో ఆ గ్రామ సర్పంచి కుమారుడు నాగభూషణ్‌రెడ్డి రేణుకానగర్ క్రాస్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే డౌన్, డౌన్ అంటు నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే వాహనంపై దాడికి దిగారు. వెంటనే పోలీసులు, గన్‌మెన్లు ఆందోళనకారులను పక్కకు లాగి ఎమ్మెల్యే వాహనాన్ని ముందుకు పంపించారు. దాడి చేసినవారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత ఎమ్మెల్యే మద్దతుదారులు, అసమ్మతినేతల మధ్య పోలీస్టేషన్‌లో ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఎమ్మెల్యేపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పెనుకొండ మున్సిపల్ చైర్మన్ ఫరూక్ ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పులివెందులలో మద్యం దుకాణం తొలగించాలని

మహిళల నిరసన

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో మద్యం సెగలు రగిలాయి. పులివెందుల చెన్నారెడ్డి కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలని సోమవారం మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఇక్కడి నుంచి మద్యం దుకాణం తొలగించాలంటూ నినాదాలు చేశారు. 'మందు బాబులు షాపు నుంచి మద్యం తీసుకుని ఆరుబయట కూర్చొని తాగుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది' అని పలువురు మహిళలు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. పోలీసులు ఆందోళనాస్థలికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీనిచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

బిఎస్‌పి ఎంపిపై అనర్హత వేటు

- లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం కాగా, మరో బిఎస్‌పి ఎంపిపై తాజాగా అనర్హత వేటు పడింది. కిడ్నాప్, హత్య కేసులో నాలుగేళ్లు శిక్షపడిన బిఎస్‌పికి చెందిన ఘజియాపూర్ ఎంపి అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 29 నుంచి అనర్హత అమలులో ఉంటుందని పేర్కొంది.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు రూ.172.22 కోట్ల కాంట్రాక్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐఎల్) విశాఖపట్నం మరో మైలు రాయిని దాటింది. పారదీప్ పోర్టు నుంచి రూ.172.22 కోట్ల కాంట్రాక్టును తాజాగా దక్కించుకుంది. డిసిఐ 2017 తర్వాత దేశంలోని నాలుగు మేజర్ పోర్టులైన విశాఖపట్నం, పారదీప్, జెఎన్‌పిటి, దీన్‌దయాల్ పోర్టుల మెజారిటీ వాటా 73.47 శాతంతో ప్రభుత్వ పోర్టుల నిర్వహణలో నడుస్తోన్న విషయం తెలిసిందే. పారదీప్ పోర్టు ద్వారా పొందిన కాంట్రాక్టు ప్రకారం అక్కడ అప్రోచ్ ఛానెల్, ఎంట్రన్స్ ఛానెల్, టర్నింగ్ సర్కిల్, డాక్స్, ఇసుక ట్రాపింగ్ వంటి పనుల కోసం రూ.172.22 కోట్లు మేర ఆర్డర్‌ను 2023-24కు దక్కించుకోవడం విశేషం. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న రూ.1000 కోట్ల టర్నోవర్ వైపునకు డిసిఐఎల్ శరవేగంగా అడుగులు వేస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ముగ్గురు డైరెక్టర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు ప్రభుత్వం ముగ్గురు డైరెక్టర్లను నియమించింది. వీరిలో త్రిపురాబొట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ, గున్నంటి వివిఎస్-ఎస్‌బి పూర్ణానందశర్మ, యనమండ్ర సాయి సురేష్‌లు ఉన్నారు. సోమవారం గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమసంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఎమ్‌డి ఎస్.శ్రీనివాసరావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయశాఖ సలహాదారులు జ్వాలాపురపు శ్రీకాంత్, జనరల్ మేనేజరు జి.నాగసాయి, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు గుర్తింపు రద్దును ఎత్తివేయాలి

- నేడు నల్లబ్యాడ్జీలతో నిరసనకు బిఎస్‌ఎన్‌ఎల్‌ఇయు పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో చారిత్రాత్మకంగా జరిగిన రైతుల ఉద్యమానికి మద్దతు ఇచ్చి, ఆర్థిక సాయం చేసిన రెండు పోస్టల్ సంఘాలు ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయుల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎస్‌ఎన్‌ఎల్‌ఈయు) ఖండించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ, వెంటనే గుర్తింపు రద్దును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మంగళవారం గంట పాటు నల్లబ్యాడ్జీలతో నిరసనకు పిలుపునిచ్చింది. ఈ మేరకు బిఎస్‌ఎన్‌ఎల్‌ఇయు ప్రధాన కార్యదర్శి పి. అభిమన్యు ప్రకటన విడుదల చేశారు.

'శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా' కేసు విచారించండి

- మధుర కోర్టుకు అలహాబాద్ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : శ్రీకృష్ణ జన్మభూమి- షాహీ ఈద్గా స్థల వివాదం కేసును విచారించాలని మధుర సివిల్ కోర్టును అలహాబాద్ హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఎలాంటి అంశాల ద్వారా ప్రభావితం కాకుండా చట్ట ప్రకారం విధివిధానాలను అనుసరించి పిటీషన్‌ను విచారణ చేయాలని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది.

'ది కేరళ స్టోరీ' ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారమే : విజయన్

కొచ్చి : 'ది కేరళ స్టోరీ' అనే సినిమా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని సంఘ్ పరివార్ ప్రచారం మాత్రమేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. లవ్ జిహాద్ అంశాన్ని లేవనెత్తడం ద్వారా కేరళను మత తీవ్రవాద కేంద్రంగా చిత్రీకరించేందుకు ఈ ప్రచారాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు. 'హిందూ మహిళలను ఇస్లాంలోకి మార్చేందుకు ముస్లింలు కుట్ర పన్నారంటూ ప్రచారం చేశారు. దీనిని న్యాయస్థానాలు, విచారణ సంస్థలు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తోసిపుచ్చాయి' అని విజయన్ వివరించారు. 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సుదీప్తో సేన్ దర్శకత్వం వహించారు. కేరళపై విద్వేష భావాన్ని కలిగించేందుకే ఈ చిత్రాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్మించారని విజయన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో విమర్శించారు. 'కేరళలో రాజకీయ ప్రయోజనాన్ని పొందేందుకు సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఇలాంటి ప్రచార చిత్రాలను, ముస్లింలను సమాజం నుండి వేరు చేసే వాటి ప్రయత్నాలను మనం చూడాల్సి ఉంది' అని విజయన్ అన్నారు. ఇలాంటి ఎత్తుగడలు కేరళలో ఫలించబోవని, అందుకే ఆ సంస్థలు బూటకపు కథనాల ఆధారంగా తీసిన సినిమాల ద్వారా విచ్ఛిన్నకర రాజకీయాలను వ్యాప్తి చేస్తున్నాయని విమర్శించారు.

టెక్స్‌టైల్ పార్కు ప్రారంభిస్తాం

యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గతంలో ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్క్ భూములు కేటాయించి, డిపిఆర్ సిద్ధం చేశామని, మళ్లీ టిడిపి అధికారంలోకి రాగానే ఈ పార్క్ ప్రారంభిస్తామని, పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు శివారు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైంది. కడిమెట్ల, ఎర్రకోట, రాళ్లదొడ్డి, గోనేగండ్ల మీదుగా గాజులదిన్నె వరకూ యాత్రం సాగింది. యాత్రలో లోకేష్ మాట్లాడుతూ చేనేతలకు విద్యుత్ బిల్లు సాకుగా చూపి సంక్షేమ పథకాలు తొలగిస్తున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దామాషా ప్రకారం చేనేతలకు నిధులిచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చేనేత ముడిసరుకును రాయితీ మీద అందిస్తామన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కమీషన్ల కోసమే టెక్స్‌టైల్ పార్కును నిలిపివేశారని ఆరోపించారు. ఎమ్మిగనూరు చేనేత సొసైటీకి చెందిన 23 ఎకరాల భూమిపై విచారణ చేపట్టి తిరిగి చేనేతలకు అప్పగిస్తామన్నారు. చేనేత కూలీలకూ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంఛార్జి బివి జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు చేనేతల సమావేశంలో మాట్లాడుతున్న నారాలోకేష్

విడాకులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ : విడాకులపై సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. తిరిగి కలిసేందుకు అవకాశం లేని జంటలకు వెంటనే విడాకులు మంజూరు చెయ్యొచ్చని పేర్కొంది. పరస్పర అంగీకారంతో విడాకులు పొందాలనుకునే జంటలు ఆరు నెలలు వేచి ఉండాలన్న నిబంధనను షరతులకు లోబడి తీసివేయవచ్చని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఏ.ఎస్. ఒకా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ జే.కే. మహేశ్వరిలతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు తీర్పు నిచ్చింది. హిందూ వివాహ చట్టం సెక్షన్ 13 బి ప్రకారం విడాకులు కోరుకునే జంట ఆరు నెలలు ఎదురు చూడాల్సి ఉంటుందన్న నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నేడు ఈ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని 142 వ అధికరణం ప్రకారం కోర్టుకు ఉన్న విశేష అధికారంతో పౌరుల ప్రాథమిక హక్కులను దష్టిలో ఉంచుకుని ఈ ఉత్తర్వులు ఇచ్చినట్టు పేర్కొంది. ఈ కేసు విచారణను ఏడేళ్ల క్రితం జస్టిస్ శివ కృతి సింగ్, జస్టిస్ ఆర్. భానుమతిలతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో ఇరు పక్షాల వాదనలు విన్న రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

అనుచరునిపై చేయిచేసుకున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

వైసిపి యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు తన అనుచరునిపై చేయి చేసుకున్నారు. ఈ ఘటన అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో సోమవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు పాల్గొన్నారు. ఆయనను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అనుచరులైన మెరుగు అప్పలనాయుడు, పోలారపు పారునాయుడు, వాసుపల్లి శ్రీనివాసు తదితరులు అడ్డుకున్నారు. 'కన్నబాబు గో బ్యాక్' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై నిలదీశారు. సొంత పార్టీ నేతలే ఆ విధంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. వారిపైకి దూసుకెళ్లారు. ఈ క్రమంలో అతన్ని వారించేందుకు ప్రయత్నిం చిన అనుచరుడు నవీన్ వర్మపై ఎమ్మెల్యే చేయిచేసుకున్నారు. అనంతరం పోలీసులు సర్దిచెప్పడంతో కార్యక్రమం యథావిధిగా సాగింది.



జెపి మోర్గాన్ చేతికి ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్

వాషింగ్టన్ : అమెరికాలో రెండో అతిపెద్ద బ్యాంకింగ్ దిగ్గజం అయినా ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌ను జెపి మోర్గాన్ గ్రూప్ స్వాధీనం చేసుకుంది. ఇటీవల సిలికాన్ వ్యాలీ బ్యాంక్ తర్వాత ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ (ఎఫ్‌ఆర్‌బి) దివాలా అంచునకు చేరింది. తాజా నిర్ణయంతో ఆ బ్యాంక్ అన్ని డిపాజిట్లు, ఆస్తులు ఇక నుంచి జెపి మోర్గన్ స్వాధీనంలోకి వెళ్తాయని కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ప్రొటెక్షన్ అండ్ ఇన్నోవేషన్ వెల్లడించింది. ఈ విషయాన్ని అమెరికాలోని ది ఫెడరల్ డిపాజిట్స్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎఫ్‌డిఐసి) కూడా ధృవీకరించింది. బ్యాంకుల వరుస మూసివేతతో అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం వైపు పయనిస్తోంది. విత్త సంస్థల్లో ఆర్థిక స్థిరత్వం నెలకొనేలా అమెరికా ఫెడరల్ రిజర్వ్ అత్యవసర చర్యలు చేపడుతోంది. సోమవారం నుంచి అమెరికాలోని 8 రాష్ట్రాల్లోని 84 శాఖలను జెపి మోర్గన్ తెరువనుంది. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ కోసం నిర్వహించిన వేలంలో పిఎన్‌సి ఫైనాన్షియల్ సర్వీసు గ్రూప్, సిటిజన్ ఫైనాన్షియల్ సర్వీస్ గ్రూపు సహా జెపి మోర్గన్‌తో కూడా బిడ్లు దాఖలు చేసింది. ఈ పోటీలో జెపి మోర్గాన్ ఆ బ్యాంక్‌ను దక్కించుకుంది. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌కు ఏప్రిల్ 13 నాటికి 229 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి. వీటితో పాటు 103.9 బిలియన్ డాలర్ల డిపాజిట్లు కూడా ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఒక్కొక్కటిగా అమెరికన్ బ్యాంక్‌ల బలహీనతలు బయటపడుతున్నాయి. గడిచిన మార్చిలో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ సహా సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీసిన విషయం తెలిసిందే. ఎఫ్‌ఆర్‌బి నుంచి ఖాతాదారులు మార్చిలో సుమారు 100 బిలియన్ల డాలర్లు డిపాజిట్లను ఉపసంహరించుకున్నారు. గత వారం ఎఫ్‌ఆర్‌బి షేర్లు 75 శాతం పడిపోయాయి.

చార్జిషీట్‌లో కవిత భర్త అనిల్ కుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్ కుమార్ పేరును కూడా ప్రస్తావించింది. ఈ కేసులో గత నెలలో ఇడి దాఖలు చేసిన చార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుని, విచారణకు స్వీకరించింది. గత నెల 6న ఒకటి, 27న మరొక అనుబంధ ఛార్జిషీట్లను ఇడి దాఖలు చేసింది. ఏప్రిల్ 27న దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ప్రకటించింది. అనుబంధ చార్జిషీట్‌లలో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి పేర్లను ఇడి ప్రస్తావించింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అరెస్టయిన అరుణ్ పిళ్లై, అమన్‌దీప్ ధల్, గౌతమ్ మల్హోత్ర, మాగుంట రాఘవులు విచారణలో ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా అభియోగ పత్రాలు ఇడి దాఖలు చేసింది.

సంపాదకీయం

మనసు లేని మాట

ప్రధాని మోడీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' మొన్నటితో వంద ఎపిసోడ్స్ పూర్తి చేసుకుంది. 2014 అక్టోబర్ 3 దసరా నాడు మొదలైంది. ప్రతి నెలా చివరి ఆదివారం ప్రధాని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలతో మాట్లాడుతున్నారు. మన్ కీ బాత్ అంటే మనసులో మాట. ఎనిమిదిన్నరేళ్లల్లో ఏనాడూ మోడీ మాటలో మనసు కనిపించలేదు. అదొక ప్రచార విన్యాసం. స్వీయ కీర్తి కండూతిలు. వాగాడంబరం. నాటకీయ ఫక్కీ. బిజెపి, దాని రాజ గురువు ఆర్ఎస్ఎస్ దేశంలో చర్చనీయాంశం చేయాలనుకున్న విషయాలు మన్ కీ బాత్‌లో ప్రధాని నోట ఊడిపడతాయి. అంతే తప్ప ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అభిప్రాయాలు కాగడా వేసి చూసినా కనిపించవు. వాస్తవం ఇది కాగా తన నూరవ ఎపిసోడ్‌లో మోడీ, ప్రజలతో మమేకం కావడానికి మన్ కీ బాత్ దోహదపడిందని తన సహజ శైలిలో వంచించారు. ఆధ్యాత్మిక ప్రయాణంగా, ప్రజా దేవుళ్ల పాదాల చెంత ప్రసాదంగా, విశ్వాసం, ఆరాధనా వ్రతంగా అభివర్ణించి తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారు. స్ఫూర్తి గాథలు వెలుగులోకి తెచ్చేందుకు వేదిక అయిందని ఊదరగొట్టారు.

ప్రజాధనంతో నిర్వహించిన 'మనసులో మాట' జన బాహుళ్యానికి ఎంత మేరకు ఉపయోగపడిందన్నది సందేహాస్పదం. ప్రధాని ఉన్నపళంగా రాత్రికి రాత్రి పెద్ద నోట్ల రద్దు ప్రకటన చేశారు. దాని వలన ఉపాధి కోల్పోయి వీధినపడ్డ కార్మికుల ఈతిబాధలపై, బ్యాంకుల వద్ద క్యూలైన్లలో ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటనలపై మన్ కీ బాత్‌లో మోడీ నోరు పెగల్లేదు. జిఎస్‌టి విధింపుపైనా అంతే. బిజెపి దేశ ప్రజలకు ఇచ్చిన హామీ విదేశాల్లో నల్లధనం వెలికితీత. ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమ. దానిపై మోడీ సమాధానం చెప్పరు. యువతకు ఇచ్చిన వాగ్దానం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు. ఇప్పటికి ఎన్ని ఉద్యోగాలిచ్చారో తెలపరు. రైతులకు రెట్టింపు ఆదాయం బాసపైనా మౌనమే. భావ వ్యక్తీకరణకు మన్ కీ బాత్ వేదిక అయిందంటున్నారు మోడీ. రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును కాలరాయడంలో కేంద్రం, బిజెపి పాలిత రాష్ట్రాలది అందె వేసిన చెయ్యి. విపక్షాలు, హక్కుల కార్యకర్తలు, మేధావులపై పెగాసెస్ స్పైవేర్, తదితరాలతో నిఘా పెట్టడమే కాకుండా అక్రమ నిర్బంధాలు, హత్యలు నితయకృత్యమయ్యాయి. తమ విధానాలను వ్యతిరేకించే, నిరసించే గొంతులను నిరంకుశ చర్యలతో నొక్కుతూ భావ వ్యక్తీకరణ వంటి మాటలు మాట్లాడటం బిజెపికి, మోడీకే చెల్లింది. మన్ కీ బాత్‌లో ఇవేవీ చర్చకు రావు.

ఆర్థిక నేరగాడు అదానీ అక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడింది. ఆ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌పై కేంద్ర సర్కారు నుంచి స్పందన లేదు. జెపిసి దర్యాప్తునకు ససేమిరా అంది. ఎక్కడో ఏదో చిన్న సంఘటపై మన్ కీ బాత్‌లో లెక్చర్లిచ్చే మోడీ, అదానీపై మూగనోము ఎందుకు పట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాఫెల్ యుద్ధ విమానాల స్కామ్‌పై తాడూ బొంగరం లేని వాదనలు తప్ప విచారణకు నో అన్నారు. ఎన్నికల ముందు పుల్వామా దాడిలో వీర జవాన్ల మరణాలను ప్రచారాస్త్రంగా చేసుకొని మన్ కీ బాత్‌లో భావోద్వేగానికి పోయిన ప్రధాని, ఆ ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యంగా బద్దలైనప్పుడు నోరు మెదపకున్నారు. మత ఘర్షలు, యు.పి.లో సి.ఎం యోగి విచక్షణారహిత ఎన్‌కౌంటర్లు, ఫెడరలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, కడకు రాజ్యాంగంపై దాడుల విషయంలో ప్రధాని ఏం చెబుతారోనని జనం ఎదురు చూస్తున్నారు. ధరాభారం, ప్రభుత్వ రంగ అమ్మకం, మహిళలు, దళితులు, మైనార్టీలపై హిందూ మతోన్మాదుల కిరాతకాలపై మోడీ సమాధానం కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారు. మేడే నేపథ్యంలో ప్రసంగించిన ఈ నూరవ ఎపిసోడ్‌లో కనీసం కార్మికులకు శుభాకాంక్షలు చెప్పడానికి ప్రధానికి నోరు రాలేదు. శ్రమ జీవుల పట్ల వారి దృక్పథమది. కరోనా లాక్‌డౌన్లు, వలస కూలీల అవస్థలు, కరోనా వైఫల్యంతో లక్షల మరణాలకు మన్ కీ బాత్‌లో చోటు లేదు. కార్పొరేట్-హిందూ మతతత్వ ఎజెండా, ప్రచారార్భాటం ఆ ఎపిసోడ్స్ ఆంతర్యం అన్నది స్పష్టం. ప్రజల ప్రస్తావన లేని వారి ప్రశ్నలకు జవాబులు దొరకని కార్యక్రమం ఏదైనా ప్రజల మన్నన పొందజాలదు.

మహనీయుల మాట



రూసో మహాశయుని రచన 'సోషల్ కాంట్రాక్ట్' కన్నా, అమెరికా రాజ్యాంగం 'బిల్ ఆఫ్ రైట్స్' కన్నా, 'మనిషి, పౌరుని హక్కులు' గురించిన ఫ్రెంచి ప్రకటన కన్నా...మరే ఇతర రాజకీయ రచన కన్నా కూడా... ఆధునిక ప్రపంచపు ఆచరణాయుత రూపకల్పనలో 'కమ్యూనిస్టు ప్రణాళిక' ప్రభావం చాలా ఎక్కువ. ఇందుకు మొదటి కారణం అందులో వున్న రాజకీయ సందేశమే.

ప్రొ॥ అయిజాజ్ అహ్మద్,
మార్క్సిస్టు తత్వవేత్త.

డాలర్ పెత్తనానికి ముప్పు


తాను ఏ యే దేశాల ఎడల శత్రుపూరిత వైఖరి అవలంబిస్తోందో ఆ యా దేశాల మీద ఆంక్షలను విధించడం అమెరికా విధానం. దాని ఫలితంగా ప్రపంచం అంతా రిజర్వు కరెన్సీగా పరిగణిస్తున్న డాలర్ ఆధిపత్యం ప్రమాదంలో పడుతున్న సంగతి చాలామందికి ఎప్పటినుంచో కనిపిస్తూనే వుంది. ఆ విషయాన్ని ఇన్నాళ్ళకి అమెరికా ఆర్థిక శాఖ కార్యదర్శి జానెట్ యెల్లెన్ మొత్తానికి ఒప్పుకున్నారు. ఒకటో, రెండో దేశాల మీద గనుక ఆంక్షలు విధిస్తే అప్పుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. కాని ఈ మధ్య అమెరికా డజన్లకొద్దీ దేశాల మీద ఆంక్షలు విధిస్తోంది. అప్పుడు ఆంక్షలకు గురైన ఆ దేశాలన్నీ కూడబలుక్కుని తమలో తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని ఆంక్షల ప్రభావాన్ని తట్టుకుని నిలబడడానికి పూనుకుంటున్నాయి. ఆ విధమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అమెరికన్ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసే విధంగా ప్రభావాన్ని చూపిస్తున్నాయి. తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద అమెరికా చెలాయిస్తున్న పెత్తనాన్ని సవాలు చేస్తున్నాయి.

ఒకవైపు ఆంక్షల వలన ఎదురుదెబ్బ తగులుతోందని అంగీకరిస్తూనే మరోవైపు ఆ విధంగా ఆంక్షలు విధించడం సరైన విధానమే అని జానెట్ యెల్లెన్ ప్రకటించడం మాత్రం విడ్డూరంగా ఉంది. తమకు ప్రతికూల విధానాలను అవలంబిస్తున్న దేశాల మీద ఆంక్షలు విధించినంత మాత్రాన ఆ దేశాలు తమ విధానాలు మార్చుకునేలా చేయడం సాధ్యం కావడం లేదని అంటూనే, ఆంక్షల ఫలితంగా ఆ దేశాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె అంగీకరించారు. ఇందుకు ఉదాహరణగా ఇరాన్‌ను ప్రస్తావించారు. సంవత్సరాల తరబడి ఇరాన్ మీద ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్ అనుసరిస్తున్న విధానాలలో మార్పు లేదని, ఆ విధానాలు అమెరికాకు ప్రతికూలంగానే కొనసాగుతున్నాయని ఆమె చెప్పారు. ఒకపక్క ఇరానియన్ ప్రజలు ఆంక్షల ఫలితంగా చాలా ఇబ్బందులు పడుతున్నా, ఇరాన్ ప్రభుత్వం మాత్రం తన విధానాలను మార్చుకోలేదని అన్నారు. "మేము విధించిన ఆంక్షలు ఇరాన్‌లో వాస్తవానికి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించాయి. అందువలన ఆర్థికంగా ఇరాన్ చాలా ఎక్కువగా నష్టపోతోంది. కాని ఆంక్షలు ఇరాన్ తన విధానాన్ని మార్చుకునేలా చేయగలిగాయా అంటే మాత్రం మేం ఆశించిన విధంగా జరగలేదనే చెప్పాలి." అని ఆమె అన్నారు. ఒకపక్క ఈ విధంగా ఆంక్షల వలన ప్రయోజనం లేదని అంగీకరిస్తూనే, అమెరికా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఆమె సమర్థించడమే గాక వాటిని మరింత కఠినంగా అమలు చేయడం ఎలా అన్నదే తమ ఆలోచన అని అన్నారు.



ప్రభాత్ పట్నాయక్

అమెరికా నుండి ఆంక్షలకు గురైన దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం, అటువంటి ఏర్పాట్లు అమెరికా ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద చెలాయిస్తున్న పెత్తనాన్ని దెబ్బతీసేవిగా పరిణమించడం అనేది ప్రస్తుతం కళ్ళముందు కనిపిస్తోంది. అమెరికా ఆంక్షలకు గురైన రష్యా ఇప్పుడు చాలా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మళ్ళీ ఏర్పరచుకుంటోంది. గతంలో సోవియట్ యూనియన్‌గా ఉన్న కాలంలో ఏవిధంగా రూబుల్ కు, ఆ యా దేశాల కరెన్సీలకు మధ్య ఒక నిర్ధారిత మారకపు రేటుకు ఒప్పందానికి వచ్చి వ్యాపార లావాదేవీలను జరిపేవారో, అదే మాదిరిగా ఇప్పుడు చేస్తోంది. తద్వారా డాలర్ ప్రమేయం లేని వ్యాపారం నిర్వహిస్తోంది.



డాలర్ ఆధిపత్యం కొనసాగితే సంపన్న పశ్చిమ దేశాలకు ఒనగూరే ప్రయోజనం ఇంకొకటి, అతి ముఖ్యమైనది ఉంది. తమకు ముడిపదార్థాలను సరఫరా చేసే మూడో ప్రపంచ దేశాల మీద అవి తమ పట్టును మరింత బిగించగలుగుతాయి. ఆ ముడిసరుకుల ధరలను పెరగకుండా అదుపులో ఉంచడానికి, తద్వారా ఆ మూడో ప్రపంచ దేశాల ఆదాయాలలో పెరుగుదల లేకుండా చేయడానికి డాలర్ ఆధిపత్యం తోడ్పడుతుంది.

దీని ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలోని ఒక గణనీయమైన భాగంలో డాలర్ మారక సాధనంగా చెలామణీలో ఉండనవసరం లేకుండా పోయింది. అందువలన డాలర్ పెత్తనానికి పెద్ద ప్రమాదం ఎదురవుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో సరకుల ధరలను డాలర్లలో నిర్ధారిస్తున్నారు. ఐతే డాలర్ ఆధిపత్యానికి అది మూల కారణం కానేకాదు. వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి డాలర్లు వాస్తవంగా అవసరం అవడమే దాని ఆధిపత్యానికి కారణం. అంటే అంతర్జాతీయ వాణిజ్యం అత్యధిక భాగం డాలర్లలోనే వాస్తవంగా సాగుతోంది. ఆ ప్రత్యేక పరిస్థితి వలన డాలర్‌కి అంత ప్రాధాన్యత వచ్చింది.

అంతే కాదు, ప్రపంచవ్యాప్తంగా తమ సంపదను దాచుకోవాలనుకునేవారు డాలర్ల రూపంలోనే దాచుకుంటున్నారు. డాలర్ల రూపంలోనే లావాదేవీలన్నీ సాగుతూ వుండడమే దీనికి ప్రధాన కారణం. డాలర్ కి స్వత:సిద్ధమైన విలువ ఏమీ లేదు. డాలర్లను తయారు చేయడానికి పెద్దగా శ్రమ పడనక్కరలేదు. అదే మనం ఉపయోగించే వేరే ఏ సరుకునైనా ఉత్పత్తి చేయాలంటే కొంత శ్రమ అవసరం. అందుచేత ఆ సరుకుకి స్వత:సిద్ధంగా కొంత విలువ ఉంటుంది. డాలర్‌కి అటువంటి విలువ ఏమీ లేదు. ఐతే ప్రతీ సరుకు విలువనూ లెక్కించేటప్పుడు, ఆ సరుకులను అంతర్జాతీయ మార్కెట్‌లో మారకం చేసేటప్పుడు డాలర్‌ను మారకపు సాధనంగా వాడుతున్నందువల్ల డాలర్‌కి ఆ విధమైన ఆధిపత్యం వచ్చింది. డాలర్ ఆ విధమైన ఏకైక మారకపు సాధనంగా అంతర్జాతీయ మార్కెట్‌లో లేనిరోజున డాలర్ ఆధిపత్యం దెబ్బ తింటుంది. ఇప్పుడు ఆంక్షలకు గురైన దేశాలు తమ మధ్య ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం వలన ఆ దేశాల నడుమ జరిగే వ్యాపార లావాదేవీలలో డాలర్ ఒక మారకపు సాధనంగా లేకుండా పోతోంది. అది అంతిమంగా డాలర్ పెత్తనాన్ని దెబ్బ తీస్తుంది.

ఐతే, డాలర్ పెత్తనం దెబ్బ తినడానికి ఒక్క ఆంక్షలు మాత్రమే కారణం కాదు. చాలా దేశాలు, తమ మీద ఆంక్షలు లేకపోయినా, డాలర్ ఆధిపత్యం నుండి బైటపడి తమ వ్యాపార మార్కెట్లను, అవకాశాలను విస్తృతపరుచుకోవాలని భావిస్తున్నాయి. అటువంటి దేశాలు డాలర్ మారకపు సాధనంగా లేని వ్యాపార ఒప్పందాలు చేసుకోడానికి సిద్ధపడుతున్నాయి. సోవియట్ యూనియన్‌గా ఉన్న కాలంలో భారతదేశం ఆ దేశంతో సాగించిన ద్వైపాక్షిక వ్యాపారం అటువంటిదే. అమెరికా మనదేశం మీద ఆంక్షలు విధించకపోయినా, డాలర్ ఆధిపత్యంలో నడిచే అంతర్జాతీయ వ్యాపారపు పరిమితుల నుండి బైటపడి తన వ్యాపారాన్ని విస్తృతపరచుకోవాలన్న ఆకాంక్ష నుండే భారతదేశం సోవియట్ యూనియన్‌తో వ్యాపార ఒడంబడికలు చేసుకుంది. అందుచేత నయా ఉదారవాద సిద్ధాంతవేత్తలు అటువంటి ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాల మీద నిరంతరాయంగా సైద్ధాంతిక దాడి సాగించడం అంత ఆశ్చర్యపరిచేదేమీ కాదు. డాలర్ ఆధిపత్యంలో మాత్రమే అంతర్జాతీయ వాణిజ్యం యావత్తూ జరగాలన్నది వారి సిద్ధాంతం. కాని ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలలో అటువంటి సిద్ధాంతం ఏమీ లేదు. తాజాగా చైనా, బ్రెజిల్ దేశాలు కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలలో కూడా ఆ రెండు దేశాల కరెన్సీలలోనే లావాదేవీలన్నీ జరుగనున్నాయి. అమెరికా ఆ రెండింటిలోనూ దేనిమీదా ఏ ఆంక్షలూ విధించలేదు. ఐనా అవి ఆ విధమైన ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నాయి. అది కేవలం తమ రెండు దేశాల స్వంత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఆ విధంగా చేస్తున్నాయి.

బ్రిక్స్ బ్యాంక్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా దేశాలు బ్రిక్స్‌గా ఒక కూటమిలో ఉన్నాయి)కు తాజాగా అధ్యక్షురాలిగా నియమించబడిన దిల్మా రౌసెఫ్ (ఈమె గతంలో బ్రెజిల్ అధ్యక్షురాలిగా పనిచేశారు) ఒక ప్రకటన చేశారు. దాని ప్రకారం 2022 నుండి 2026 మధ్య ఆ బ్యాంకు సభ్యదేశాలకు ఇవ్వబోయే రుణంలో 30 శాతం ఆ యా దేశాల కరెన్సీల రూపంలోనే ఇస్తారు. తద్వారా ఆ మేరకు డాలర్ ప్రమేయం తగ్గిపోతుంది.

అంతర్జాతీయ వాణిజ్యం యావత్తూ డాలర్‌ల రూపంలోనే జరిగితే దాని వలన అమెరికాకు రెండు ప్రయోజనాలు ఉంటాయి. మొదటిది: డాలర్ అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా పరిగణించబడుతుంది గనుక అమెరికా తన వాణిజ్య చెల్లింపులలో లోటు తలెత్తినా, ఏ మాత్రమూ ఆందోళన పడనవసరం లేదు. ఏ యే దేశాలకు తాను చెల్లింపులు చేయవలసి వుందో, ఆ దేశాలకు తాను బాకీ ఉన్నట్టు హామీపత్రాలు రాసిఇస్తే చాలు. ఆ పత్రాలకు డాలర్లకు ఉన్నంత విలువ ఉంటుంది గనుక వాటికి ఆమోదం ఉంటుంది. ఆ క్రమంలో అమెరికా వాణిజ్య లోటు పెరిగినప్పటికీ, అంతర్జాతీయంగా వాణిజ్యానికి, తద్వారా ఆర్థిక పరిస్థితికి అదనపు వ్యయం ద్వారా అదనపు డిమాండ్ తీసుకువచ్చి, దాని ఫలితంగా కొంత ఊపు తీసుకురావచ్చు. ఇక రెండో ప్రయోజనం: డాలర్ ఆధిపత్యం ఉంటే అది అమెరికన్ బ్యాంకుల వ్యాపారాన్ని కూడా బాగా పెంచుకోడానికి తోడ్పడుతుంది. ప్రపంచంలో కేవలం అమెరికన్ బ్యాంకులు మాత్రమే డాలర్ల లావాదేవీలు నడుపుతాయని కాదు కాని, డాలర్ ఆధిపత్యం తక్కిన ఏ దేశాల బ్యాంకులకన్నా అమెరికన్ బ్యాంకులకే ఎక్కువగా ఉపయోగపడతాయి.

డాలర్ ఆధిపత్యం కొనసాగితే సంపన్న పశ్చిమ దేశాలకు ఒనగూరే ప్రయోజనం ఇంకొకటి, అతి ముఖ్యమైనది ఉంది. తమకు ముడిపదార్థాలను సరఫరా చేసే మూడో ప్రపంచ దేశాల మీద అవి తమ పట్టును మరింత బిగించగలుగుతాయి. ఆ ముడిసరుకుల ధరలను పెరగకుండా అదుపులో ఉంచడానికి, తద్వారా ఆ మూడో ప్రపంచదేశాల ఆదాయాలలో పెరుగుదల లేకుండా చేయడానికి డాలర్ ఆధిపత్యం తోడ్పడుతుంది.

ఆ క్రమం ఈ విధంగా ఉంటుంది: మూడో ప్రపంచ దేశాలలో ఉత్పత్తి అయ్యే ఒకానొక ముడిసరుకుకి అంతర్జాతీయంగా అదనపు డిమాండ్ ఏర్పడిందనుకోండి. అప్పుడు దాని ధర ఆ దేశపు స్థానిక కరెన్సీ లెక్కల్లో పెరుగుతుంది. స్థానికంగా సరుకు ధర పెరిగిందంటే దాని ఫలితంగా ఆ స్థానిక కరెన్సీ విలువ డాలర్లతో పోల్చినప్పుడు పడిపోతుందన్న అంచనాలకు అది దారితీస్తుంది. ఒక రిజర్వు కరెన్సీగా ఉన్నందున డాలర్ విలువ సాపేక్షంగా స్థిరంగా ఉంటుందన్న అభిప్రాయం వలన ఈ విధంగా జరుగుతుంది. దానివలన తమ సంపదను స్థానిక కరెన్సీలో కాకుండా డాలర్‌లలో దాచుకోడానికి తయారౌతారు. అందువలన ఆ మూడో ప్రపంచ దేశం నుండి పెట్టుబడి అమెరికాకు తరలిపోతుంది. అప్పుడు ఆ మూడో ప్రపంచ దేశంలో నిజంగానే డాలర్ల కొరత ఏర్పడుతుంది. దాని ఫలితంగా ఆ దేశపు స్థానిక కరెన్సీ విలువ నిజంగానే పడిపోతుంది. దానిని అదుపు చేయడానికి ఆ దేశం తన వడ్డీ రేట్లను పెంచవలసి వస్తుంది. అప్పుడు ఆ దేశంలో ఆదాయాలు పడిపోతాయి. దాని ఫలితంగా ఆ ముడిసరుకును ఆ దేశంలో వినియోగించడం తగ్గిపోతుంది. మొదట అంతర్జాతీయంగా ఆ సరుకుకు పెరిగిన డిమాండ్ కాస్తా ఇప్పుడు స్వంతదేశంలో తగ్గిపోయిన వినియోగం కారణంగా తగ్గుతుంది. సంపన్న పశ్చిమ దేశాలకు కావలసిన పరిమాణంలో ఆ ముడిసరుకు వారికి ధర ఏమీ పెరగకుండానే దొరుకుతుంది.

గతంలో వలస పాలన ఉన్న రోజుల్లో వలస దేశాల్లో ముడిసరుకుల వినియోగాన్ని కుదించడానికి వీలుగా ఆ దేశాల ప్రజల ఆదాయాలు తగ్గిపోయే విధంగా చర్యలు తీసుకునేవారు. అప్పుడు తమ దేశాలకు కావలసినంత ముడిసరుకును ధర పెంచకుండానే తరలించుకు పోగలిగేవారు. ఇప్పుడు డాలర్ మాధ్యమంలో అంతర్జాతీయ వాణిజ్యాన్ని నిర్వహించడం ద్వారా అదే ఫలితాన్ని పొందగలుగుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ విధమైన దోపిడీ ద్వారా తన మనుగడ కొనసాగించగలుగుతోంది. డాలర్ మాధ్యమంలో వాణిజ్యం జరగడం అటువంటి కీలక పాత్ర పోషిస్తోంది.

ఇప్పుడు డాలర్ల ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం పెరుగుతున్నకొద్దీ అది ఈ పశ్చిమ సంపన్న దేశాల ఆధిపత్యాన్ని దెబ్బతీస్తూ పోతుంది. ఇదేదో ఒక కరెన్సీ కి బదులు ఇంకొక కరెన్సీలో వ్యాపారం చేయడం మాత్రం కాదు. మూడో ప్రపంచ దేశాలను కొల్లగొట్టి తమ పెట్టుబడిదారీ వ్యవస్థలను పదిలంగా కొనసాగించుకోగలుగుతున్న సంపన్న పశ్చిమ దేశాల ఆధిపత్యానికి గండి కొట్టడం. అందువల్లనే అమెరికాతోబాటు తక్కిన సంపన్న పశ్చిమ దేశాలన్నీ చాలా గట్టిగా డాలర్ ఆధిపత్యం దెబ్బ తినకుండా ఉండడానికి కావలసిన అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాయి. కేవలం ఆర్థిక ఆంక్షలకే అవి పరిమితం కాకపోవచ్చు కూడా. ఇతర రూపాలలో సైతం అవి తక్కిన దేశాలమీద ఒత్తిడులను తీసుకు వస్తాయి.

అందుచేత డాలర్ల ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వాణిజ్యాన్ని నడపాలన్న ప్రయత్నాలు ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి సంకేతం. అందుకే అటువంటి ప్రయత్నాలను అడ్డుకోడానికి సామ్రాజ్యవాదులు ఏ దుర్మార్గానికైనా ఒడిగట్టడానికి తయారౌతారు.

(స్వేచ్ఛానుసరణ)

అమెరికా నుండి ఆంక్షలకు గురైన దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం, అటువంటి ఏర్పాట్లు అమెరికా ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద చెలాయిస్తున్న పెత్తనాన్ని దెబ్బతీసేవిగా పరిణమించడం అనేది ప్రస్తుతం కళ్ళముందు కనిపిస్తోంది.

సమస్య

టిటిడిలో సులభ్ కార్మికుల మెడపై కత్తి

ఘనత వహించిన తిరుమల-తిరుపతి దేవస్థానాల ఇ.ఓ ఎ.వి.ధర్మారెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, టిటిడి లోని ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఆదివారం నాడు తిరుమల కొండపై చీపుర్లు పట్టి పారిశుధ్య పనులలో భాగస్వాములయ్యారు. తాము చేతబట్టింది చీపురు కాదని, కార్మికుల మెడపై పెట్టిన కత్తి అనే విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా అధికారులు విస్మరించారు. తిరుమల కొండపై కార్మికుల సమ్మె నేపథ్యంలో ఇ.ఓ నుంచి సాధారణ ఉద్యోగి వరకు పారిశుధ్య పనులలో భాగస్వాములవ్వాలని టిటిడి ఇ.ఓ ఆదేశించారు. ఈ పనిని ఓ దైవ కార్యక్రమంగా, దేవుడి చెంత అసౌకర్యాలను తగ్గించే శక్తులుగా తమను తాము వెల్లడి చేసుకోవటానికి అధికారులు ఉత్సాహపడుతున్నారు.

టిటిడి లోని అధ్యాపకులు శాశ్వత ఉద్యోగులు, డిప్యూటీ ఇ.ఓ లకు పారిశుధ్య పనులు నెల రోజులు కేటాయించబడ్డాయి. ఉద్యోగులు తమ విధులను మానుకొని తిరుమల కొండపై చీపురు, చేట చేతబట్టి పారిశుధ్య పనులలో నిమగ్నమై ఉండాలని యాజమాన్యం ఆదేశించింది. ప్రస్తుతం ఈ పనిలో అధికారులు బిజీగా ఉన్నారు.

మల, మూత్రాలు శుద్ధి చేయాల్సిన చోట మున్సిపల్ కార్మికులు, పారిశుధ్య కార్మికులను వినియోగిస్తున్నారు. ఉద్యోగులు చేస్తున్న కృషిని టిటిడి ఇ.ఓ అభినందించారు. సమ్మెలో వున్న సులభ కార్మికులపై అన్నివైపుల నుంచి విషం కక్కటానికి ఒక పథకం ప్రకారం టిటిడి యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నది. దేవుని దగ్గర సమ్మెకు పూనుకోవటం ఏమిటి? దేవుడు వీళ్లని క్షమిస్తాడా? ముందస్తు సమాచారం ఇవ్వలేదని కొత్త పల్లవిని అందుకున్నారు.



కందారపు మురళి

2021వ సంవత్సరంలో టిటిడి ఎఫ్.ఎం.ఎస్ కార్మికులు 14 రోజులపాటు సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తుఫానుతో తిరుపతిలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా, కార్మికులు రేయి, పగలు తేడా లేకుండా 24 గంటలు టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాటి ఇ.ఓ జవహర్ రెడ్డి కార్మికుల ఉద్యమం పట్ల కఠిన వైఖరి అవలంభించారు. సమ్మె మాని విధులకు హాజరైతే తప్ప చర్చలు లేవని మంకుపట్టు పట్టారు. కార్మికులు ఏమాత్రం సడలింపు ఇవ్వకుండా నిరసన కొనసాగించారు. సిఐటియు నేతలతో చర్చలు లేవు. కార్మికులు నేరుగా వస్తే మాట్లాడతామని మొండి వాదనలు చేశారు. ఆఖరుకు చర్చలకు హాజరైన కార్మికుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక చేతులెత్తేశారు. విధిలేక 14వ రోజున కార్మికులపై పోలీసులను ఉసిగొల్పి లాఠీఛార్జి చేయించారు. తీవ్ర గాయాలతో కార్మికులు అరెస్టయ్యారు. నిర్బంధాన్ని లెక్కచేయక, రోడ్లపై కూడా ఉండనివ్వని పరిస్థితిలో నాడు సిఐటియు కార్యాలయం కేంద్రంగా కార్మికులు సమ్మెను కొనసాగించారు. విధి లేని పరిస్థితుల్లో అధికారులు దిగివచ్చి ఐ.ఎ.ఎస్ లతో కూడిన కమిటీని ఏర్పరచి, నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని కార్మికులతో ఒప్పందానికి వచ్చారు.



పోరాడుతున్న సులభ్ కార్మికులకు సంఘీభావంగా సిఐటియు ప్రత్యక్షంగా మద్దతునిచ్చి నిలబడింది. సిఐటియు తప్ప ఏ సంఘమైనా పెట్టుకోండి. ఏ రాజకీయ పార్టీతోనైనా ఉండండని కార్మికులపై అధికారులు, సులభ్ సేటు, వివిధ రాజకీయ పక్షాలు తీవ్రమైన ఒత్తిడిని తెచ్చాయి. టిటిడిలో అత్యంత బలహీనులైన కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఈ స్థాయిలో దాడికి పాల్పడటం సమంజసమా? అని నాగరిక సమాజం టిటిడిని ప్రశ్నిస్తున్నది.

2021 అక్టోబర్‌లో వేసిన కమిటీ నేటివరకు సమావేశం కాలేదంటే కార్మిక సమస్యల పట్ల టిటిడి యాజమాన్య నిర్లక్ష్యం అర్థం అవుతుంది. 2023 ఏప్రిల్ నెలలో సులభ్ కార్మికులు సామూహిక సమ్మెకు అనివార్యమై పూనుకున్నారు. తమ వైఫల్యం కారణంగానే సమ్మె జరుగుతుందన్న వాస్తవాన్ని కప్పిపుచ్చి, దేవుని దగ్గర సమ్మెలేమిటని అధికారులు దబాయిస్తున్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన టిటిడి ఉన్నతాధికారులు వాటికి తిలోదకాలిచ్చి చీపుర్లు చేతబట్టారు. తాము పట్టింది చీపురు కాదని, కార్మికుల మెడపై పెట్టిన కత్తి అని ఉద్యోగులు గమనించాలి. సులభ్ కార్మికులు, ఎఫ్ఎంఎస్ కార్మికులు, శాశ్వత ఉద్యోగుల మధ్యన చిచ్చు పెట్టేందుకు యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదన్న వాస్తవాన్ని ఉద్యోగ, కార్మికులు గమనించాలి.

నోరు, వాయి లేని సులభ్ కార్మికులతో మేము చర్చించడం ఏమిటి? వారు ఏజెన్సీకి సంబంధించిన వారు, వారి సౌకర్యాలు వారే చూసుకోవాలి. తమకు ఏం సంబంధమని మాట్లాడుతున్నారు. 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్న చోట తమకు సంబంధం లేదని ఇ.ఓ చట్టవ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఏ సమస్యకైనా ప్రిన్సిపల్ ఎంప్లాయర్ టిటిడిదే బాధ్యతని చట్టం చెబుతున్నా, ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు మాట్లాడటం మరీ అన్యాయం.

టిటిడిలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని ప్రతిపక్ష నేత హోదాలో, ముఖ్యమంత్రి హోదాలో పలుమార్లు ప్రకటించిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు నోరు మెదపటం లేదు. బోర్డు ఛైర్మన్ హోదాలో కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన వై.వి.సుబ్బారెడ్డి అగుపడటం లేదు. 2021 అక్టోబర్‌లో వరద ప్రాంతాలను సందర్శించటానికి తిరుపతి వచ్చిన ముఖ్యమంత్రి 24 గంటలలో తన హామీ అమలవుతుందని ప్రకటించారు. ముఖ్యమంత్రి వచ్చి, వెళ్లి ఒకటిన్నర సంవత్సరాలు పూర్తవుతున్నా ఆ 24 గంటలు మాత్రం ఇంకా గడవలేదు.

పాతికేళ్లకు పైగా సులభ్‌లో పనిచేస్తున్న కార్మికులు తమకు వేతనాలు పెంచాలని, లడ్డూ కార్డు, గుర్తింపు కార్డులు కావాలని కోరుతూ రోడ్డెక్కారు. కాంట్రాక్టు విధానంతో సంబంధంలేని లక్ష్మి శ్రీనివాసా కార్పొరేషన్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. టిటిడి ఆధ్వర్యంలోని స్విమ్స్, ఆయుర్వేద హాస్పిటల్‌లో పారిశుధ్య కార్మికులను కార్పొరేషన్‌లో కలిపి, తిరుమల కొండపై దేవుని చెంత పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను విలీనం చేయకుండా, కాంట్రాక్ట్ వ్యవస్థలోనే కొనసాగించటం కార్మికుల ఆగ్రహానికి కారణం. బ్రహ్మోత్సవాలలో లక్షలాది మంది భక్తులకు సేవలందించి, పారిశుధ్య పనులు చేపడుతున్న ఎఫ్ఎంఎస్, సులభ్ కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానాన్ని నిరాకరిస్తున్నారు. తాము లడ్డూ, వడకు కూడా అనర్హులమయ్యామా? ఏమిటీ వివక్ష అంటూ ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానం చెప్పకుండా అధికారులు నీళ్ళు నములుతున్నారు.

తమను కార్పొరేషన్‌లో కలపమంటున్న సులభ్, ఎఫ్.ఎం.ఎస్ కార్మికులను కలపకుండా, కార్పొరేషన్‌లో కలపవద్దు మొర్రో అంటున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్‌లో బలవంతంగా కలిపారు.

905 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అటవీ కార్మికులది మరో గోడు. 362 మంది టిటిడి అటవీ కార్మికులకు 2019వ సంవత్సరంలో టైమ్ స్కేలు అమలు పరుస్తున్నట్టు టిటిడి బోర్డు తీర్మానించింది. ఆచరణలో బోర్డు తీర్మానాన్ని అమలు పరచకుండా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి చెప్పారని 162 మంది కార్మికులను టిటిడి పర్మినెంటు చేసింది. సిఐటియులో ఉన్న 200 మంది కార్మికులను పర్మినెంటు చేయకపోగా, బోర్డు తీర్మానం ప్రకారం టైమ్ స్కేలు అమలు జరపలేదు. చివరకు వీరందరిని కార్పొరేషన్‌లో కలవాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర హైకోర్టు, దేవస్థానం 'లా' అధికారి, టిటిడి అధికారిక న్యాయవాదులు సైతం అటవీ కార్మికుల పట్ల వివక్ష మంచిది కాదని రాతపూర్వకంగా హెచ్చరికలు చేసినా, టిటిడి యాజమాన్యం పెడచెవిన పెడుతున్నది.

ఏతా వాతా టిటిడిలో తాజాపరిస్థితి ఏమంటే ఎక్కడ? ఏమి జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అత్యంత అమాయకులు, పేదలు, దళితులైన కార్మికుల కష్టాల గురించి పట్టించుకొని చర్చించడం మాట అటుంచి అన్నివైపుల నుంచి ఈ కార్మికులపై దాడికి పూనుకుంటున్నారు.

టిటిడి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టిటిడి ఇ.ఓ, జిల్లా కలెక్టర్, ఎస్.పి లు సంయుక్తంగా తిరుమల కొండపై ఉద్యోగులు, అధికారులు, మీడియాతో ఆత్మీయ సమావేశం పేరిట ఈ పేద కార్మికులపై విరుచుకుపడ్డారు. కసరత్తు చేసిన కండల వీరుడు మూలనున్న ముసలమ్మపై దాడి చేసినట్టు అత్యున్నత అధికారాలు కల్గిన ఐఎఎస్, ఐపిఎస్‌లు గొంతులేని సులభ్ కార్మికుల గొంతు నొక్కుతున్నారు.

పోరాడుతున్న సులభ్ కార్మికులకు సంఘీభావంగా సిఐటియు ప్రత్యక్షంగా మద్దతునిచ్చి నిలబడింది. సిఐటియు తప్ప ఏ సంఘమైనా పెట్టుకోండి. ఏ రాజకీయ పార్టీతోనైనా ఉండండని కార్మికులపై అధికారులు, సులభ్ సేటు, వివిధ రాజకీయ పక్షాలు తీవ్రమైన ఒత్తిడిని తెచ్చాయి. టిటిడిలో అత్యంత బలహీనులైన కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఈ స్థాయిలో దాడికి పాల్పడటం సమంజసమా? అని నాగరిక సమాజం టిటిడిని ప్రశ్నిస్తున్నది.

మానవ సేవే-మాధవ సేవ అని ప్రచారం చేసే చోట మల, మూత్రాలను శుద్ధి చేసి వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతున్న వారి పట్ల టిటిడి వైఖరి అమానవీయం. ధర్మాన్ని రక్షించండి-ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రచారం చేసే టిటిడి అన్యాయానికి గురవుతున్న కార్మికులకు అండగా నిలవాల్సిన తరుణమిది.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు,
సెల్: 94900 98840)


పశ్చిమ బెంగాల్‌లో...


కేరళలో...


తమిళనాడులో...

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

- మేడే సభలో సీతారాం ఏచూరి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను లాగేసుకునేందుకు ప్రభుత్వం పెద్దయెత్తున దాడులకు దిగుతోందని, ఈ దాడులను తిప్పికొట్టేందుకు కార్మిక, కర్షక ఐక్య పోరాటాలను ఉధృతం చేయడమొక్కటే మార్గమని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అంతర్జాతీయ కార్మికవర్గ దినోత్సవం సందర్భంగా సోమవారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్) వద్ద అరుణ పతాకాన్ని ఏచూరి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, కార్మికవర్గానికి సంఘీభావాన్ని, మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు అనేక త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని తుంగలో తొక్కి పన్నెండు గంటల పని విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు.

మేడే విశిష్టత, కార్మికులపై కాల్పులు, ఆ తరువాత మేడే ప్రకటన వంటి చారిత్రాత్మక అంశాలను ఆయన వివరించారు.

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద శక్తులు పెద్దయెత్తున లాభాలు పిండుకునేందుకు ప్రజలపై దాడులను తీవ్రతరం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రపంచం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదని అన్నారు. ఆర్థిక సంక్షోభం వెన్నంటే రాజకీయ సంక్షోభం కూడా తలెత్తుతున్నదని ఆయన చెప్పారు. ప్రపంచంలో నెలకొన్న సమస్యలను అంతం చేయడానికి కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని, కార్మికుల పోరాట ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో మరీ ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికులు, కర్షకులు, కష్ట జీవులు పోరాటాలను పెరిగాయని అన్నారు.

దేశంలో స్వాతంత్రం రాకముందు కార్మికుల రక్షణ కోసం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో రద్దు చేసిందని ఆయన విమర్శించారు.. కేంద్రం తీసుకొచ్చిన పన్నెండు గంటల పని దినానికి అనుగుణంగా చాలా రాష్ట్రాలు చట్టాలు చేయడం శోచనీయమని అన్నారు. దేశ ప్రజల సంపదను కార్పొరేట్లు లూటీ చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా కూడా ఆందోళనలు ఉధృతం చేయాలని సిపిఐ(ఎం) నేత కోరారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని ఆయన ఉద్ఘాటించారు. ఈ పోరాటాల్లో యువత, విద్యార్థులు, మహిళలు భాగస్వామ్యం కావాలని ఏచూరి కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, సుభాషిణి అలీ, సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్, అరుణ్ కుమార్, విక్రమ్ సింగ్, అవదేశ్ కుమార్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు, మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండా రెపరెపలు

- దేశవ్యాప్తంగా ఘనంగా మేడే వేడుకలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఎర్ర జెండా రెపరెపలాడింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి గల్లీ వరకు దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో కార్మికులు గొంతెత్తారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే)ను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఎర్రజెండాలను చేబూని నినాదాలు ఇస్తుకుంటూ కార్మికులు ప్రదర్శనలు చేపట్టారు. ఎక్కడికక్కడే జెండాలు ఆవిష్కరించారు. మేడే అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రస్తుత పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జించారు. జాతాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, మోటార్ సైకిల్, ఆటో ర్యాలీలు జరిగాయి. రాష్ట్రాల్లో తమ సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించారు. ఢిల్లీ, కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, గోవా, హర్యానా, అస్సాం, మణిపూర్, సిక్కిం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాల్లో మేడే వేడుకలు భారీగా జరిగాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవుల్లో కూడా మేడే కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. కార్మికులతో రైతు, విద్యార్థి, యువజన, మహిళ, సామాజిక సంఘాలతో పాటు ఇతర ప్రజా సంఘాలు మద్దతుగా ర్యాలీలు చేపట్టాయి. త్రిపురలోని అగర్తలలో జరిగిన ర్యాలీలో మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ పాల్గొన్నారు. తమిళనాడులో సిపిఎం కార్యాలయం వద్ద సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రామకృష్ణన్ జెండా ఆవిష్కరించారు. జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన ర్యాలీలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెజ్లర్ల ఆందోళన

- స్టాలిన్ మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మద్దతు తెలిపారు. రెజ్లర్ల నిరసన తొమ్మిదో రోజుకు చేరింది. సోమవారం జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనకు మాజీ క్రికెటర్, మాజీ మంత్రి నవజ్యోత్ సింగ్ సిద్ధూ మద్దతు తెలిపారు. ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ క్రాప్స్ (ఐడబ్ల్యుపిసి) మద్దతు తెలిపింది.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకూ వెనక్కు తగ్గం

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి హోదాలో ఉన్న బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే ప్రశ్నించాలని, అరెస్టు చేయాలని ఆటగాళ్లు డిమాండ్ చేశారు. ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసిన తర్వాత విచారణలో జాప్యంపై పోలీసులు వివరణ ఇవ్వడం లేదని విమర్శించారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకుండా ఆందోళన నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఎన్నికల లక్ష్యంతో ఆందోళన చేయడం లేదని చెప్పారు.

ఉమ్మడి పౌరస్మృతి, ఎన్‌ఆర్‌సి అమలుచేస్తాం

- ఏటా 3 సిలిండర్లు, రోజుకు అరలీటరు పాలు ఫ్రీ
- కర్ణాటకలో బిజెపి మ్యానిఫెస్టో విడుదల



బెంగళూరు : కర్ణాటకలో మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి), జాతీయ పౌరుల పట్టిక (ఎన్‌ఆర్‌సి)ను అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. సోమవారం బిజెపి తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా మాట్లాడుతూ 'కర్ణాటకలో మేం జాతీయ పౌరుల పట్టిక (ఎన్‌ఆర్‌సి)ను ప్రవేశపెడతాం. రాష్ట్రంలో ఉన్న అక్రమ వలసదారులందర్నీ వేగంగా బహిష్కరిస్తాం' అని చెప్పారు. మతపరమైన ఛాంధసవాదం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా 'కర్ణాటక స్టేట్ వింగ్ ఎగైనెస్ట్ రిలిజినియస్ ఫండమెంటలిజం అండ్ టెర్రర్ (కె-ఎస్‌డబ్ల్యుఐఎఫ్‌టి)' అనే ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.




బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే బిపిఎల్ కుటుంబాలకు ఏటా ఉగాది, గణేష్ చతుర్థి, దీపావళికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్లలోని అన్ని వార్డుల్లో 'అటల్ ఆహార కేంద్రం' ఏర్పాటు చేస్తామని, బిపిఎల్ కుటుంబాలకు ప్రతి రోజూ అర లీటర్ 'నందిని' పాలు, నెలవారీ రేషన్ కిట్‌లో ఐదు కేజీల 'శ్రీ అన్న - సిరి ధన్య' అందించే 'పోషణ్' అనే పథకాన్ని ప్రారంభిస్తామని బిజెపి హామీ ఇచ్చింది. కాగా, కర్ణాటక ఎన్నికల సందర్భంగా బిజెపి ఇచ్చిన హామీలపై రాజకీయ పరిశీలకులు, విశ్లేషకులు, సాధారణ ఓటర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్ల డబ్బు తరలింపు, ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షల జమ వంటి హామీల మాదిరిగానే ఈ హామీలు కూడా అమలుకానీ హామీలుగానే మిగిలిపోతాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

బిజెపి ఎన్నికల మేనిఫెస్టో బోగస్ : సిద్ధరామయ్య

బిజెపి మేనిఫెస్టోను బోగస్ అని కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 600 హామీలను గుప్పించి, 55 హామీలనే అమలు చేసిందని అన్నారు. తాము ప్రజలకు 165 హామీలు ఇస్తే, వాటిలో 158 హామీలను నెరవేర్చామని, రెండు పార్టీల మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మంగళవారం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనుంది. ఉచితాలను నిషేధిస్తామని చెప్పిన కాషాయ పార్టీ ఉచిత ఎల్‌పిజి సిలిండర్ల హామీని ఎందుకు ఇచ్చిందని కెపిసిసి చీఫ్ డికె శివకుమార్ నిలదీశారు. ఓటమి తప్పదని గ్రహించే బిజెపి నేతలు ఉచితాలపై ఆశలు పెట్టుకున్నారని అన్నారు.

ఐదేళ్లలో 1.4 కోట్ల ఉద్యోగాలు ఫట్

- టెక్నాలజీ రంగంలో కష్టకాలమే
- డబ్ల్యుఇఎఫ్ నివేదిక



జెనివా : వచ్చే ఐదేళ్లలో 1.4 కోట్ల ఉద్యోగాలు పోవచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) అంచనా వేసింది. కృత్రిమ మేధ, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఇతర ఆధునిక టెక్నాలజీ వల్ల కార్మికుల మార్కెట్‌లో పెను మార్పులు చోటు చేసుకోవచ్చుని విశ్లేషించింది. అన్ని రంగాల్లోని ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో దాదాపు 44 శాతం మంది ఉద్యోగుల నైపుణ్యాలకు కాలం చెల్లనుందని తెలిపింది. 800 కంపెనీల్లోని 1.1 కోట్ల మంది కార్మికులపై ఈ సర్వే చేపట్టినట్లు తెలిపింది. 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' పేరిట విడుదల చేసిన ఈ రిపోర్ట్ ప్రకారం.. 2027 నాటికి 8.3 కోట్ల ఉద్యోగాలు పోనున్నాయి. ఇదే సమయంలో కొత్తగా 6.9 కోట్ల ఉద్యోగాలు రానున్నాయి. నికరంగా 1.4 కోట్ల ఉద్యోగులు అంటే మొత్తం పనివాళ్లలో రెండు శాతం మంది ఉపాధి పోనుంది. ప్రస్తుత దశాబ్దం ఆరంభంలోనే ఉద్యోగాల కల్పనకు కరోనా, ఆటోమేషన్ రూపంలో పెద్ద సవాళ్లు ఎదురయ్యాయి. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు పావు వంతు ఉద్యోగాల్లో మార్పులు చోటుచేసుకోవచ్చు. ద్రవ్యోల్బణం ఆర్థిక వృద్ధిలో మందగమనం, సరఫరా కొరతలు సవాల్ విసురుతాయి. వ్యాపారాల్లో మార్పులు పూర్తిగా నూతన సాంకేతికతల అమలుపైనే ఆధారపడతాయి. వచ్చే ఐదేళ్లలో 75 శాతం కంపెనీలు బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధను ఉపయోగించుకోనున్నాయి. పునరుత్పాదక ఇంధన ఇంజినీర్లు, సౌర ఇంధన స్థాపన, వ్యవస్థల రంగాలల్లో ఇంజనీర్లకు డిమాండ్ పెరగనుంది. ఆటోమేషన్ దెబ్బతో బ్యాంక్‌ల్లో నగదు లెక్కించే క్లర్కు పోస్టులు, పోస్టల్ సేవల్లోని క్లర్కులు, టికెట్ క్లర్కులు, డేటా ఎంట్రీ క్లర్క్ ఉద్యోగాల్లో భారీగా తొలగింపులు చోటు చేసుకోనున్నాయి. విద్యా, వ్యవసాయం, డిజిటల్ కామర్స్, వాణిజ్య రంగాల్లో ఉద్యోగాల కల్పన నమోదు కానుంది.

ఫ్యాక్టరీల చట్టంలో సవరణను తొలగిస్తాం

స్టాలిన్

చెన్నై : ఫ్యాక్టరీల చట్టం 1948కు చేసిన వివాదాస్పద సవరణను ఉపసంహరిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం వెల్లడించారు. మేడే సందర్భంగా చెన్నైలోని మేడే పార్క్‌లో అధికార డిఎంకెకు చెందిన అనుబంధ విభాగం లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ (ఎల్‌పిఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఎంపిక చేసిన ఫ్యాక్టరీల్లో పని గంటలను పొడిగించేందుకు వీలుగా ఫ్యాక్టరీల చట్టంలో చేసిన సవరణను ఉపసంహరించుకునే విషయాన్ని త్వరలోనే ఎమ్మెల్యేలందరికీ తెలియజేస్తామని చెప్పారు.

ప్రపంచ వ్యాప్తంగా మేడే

- కదం తొక్కిన కార్మిక లోకం !

సియోల్, పారిస్ : ప్రపంచ వ్యాప్తంగా మేడే ఉత్సవాలను అత్యంత ఆనందోత్సాహాల మధ్య కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ర్యాలీలు, మార్చ్‌లు, ఇతర కార్యక్రమాలతో మేడే వేడుకలు జరుపుకున్నారు. ఆయా దేశాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అవలంబిస్తున్న వినాశకర ఆర్థిక విధానాలు తమపై చూపుతున్న దుష్ప్రభావాన్ని ఈ సందర్భంగా కార్మికులు ఎత్తిచూపారు. ఆసియాలోని పలు ప్రాంతాలలో అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితులను డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. దక్షిణ కొరియాలో దేశవ్యాప్తంగా జరిగిన ర్యాలీలలో లక్ష మందికి పైగా కార్మికులు భాగస్వాములయ్యారు. పరిశ్రమలలో జరిగే ప్రమాదాలకు బాధ్యులను చేస్తూ యాజమాన్యాలకు విధిస్తున్న శిక్షలను తగ్గించవద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు. పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉత్తర కొరియాలో కార్మికులు పెద్ద సంఖ్యలో కదం తొక్కారు. దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. ఇండొనేషియాలోని ప్రధాన నగరాలలోనూ ప్రదర్శనలు జరిగాయి. నూతన ఉద్యోగ కల్పన చట్టాన్ని వ్యతిరేకిస్తున్న కార్మికులు ప్లకార్డులు చేబూని నిరసన వ్యక్తం చేశారు. జపాన్‌లో మేడే ఉత్సవాన్ని జరుపుకున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. సైనిక విస్తరణను, పన్ను పెంపుదలను వ్యతిరేకించారు. మహిళలపై జరుగుతున్న హింసను నిరసిస్తూ జర్మనీలో ర్యాలీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలలో వేలాది మంది పాల్గొన్నారు. తైవాన్‌లో అమలు చేస్తున్న కార్మిక విధానాలను నిరసిస్తూ రాజధాని తైపై వీధుల్లో వేలాది మంది కదం తొక్కారు. ఫ్రాన్స్‌లో దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. మాక్రాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు.

ప్రజానుకూల విధానాల కోసం పోరాటం

- సిఐటియు అధ్యక్షురాలు కె హేమలత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మేడే సందర్భంగా హక్కుల కోసం, ప్రజా, కార్మిక అనుకూల విధానాల కోసం పోరాటాలు ఉధృతం చేసేందుకు ప్రతినబూనాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కె హేమలత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా సోమవారం నాడిక్కడ సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటిఆర్ భవన్)లో ఆ సంఘం అఖిల భారత అధ్యక్షురాలు కె హేమలత సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సిఐటియు తరపున దేశంలోని కార్మికులకు, అంతర్జాతీయ కార్మిక వర్గానికి, శ్రమ జీవులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మేడే అంటే ఎనిమిది గంటల పని విధానానికి ఒక దిక్సూచీ అని, కార్మిక వర్గం సుదీర్ఘ పోరాటం, త్యాగాలతో ఎనిమిది గంటల పని విధానం వచ్చిందని అన్నారు. 1886 కంటే ముందే ఎనిమిది గంటల పని విధానం ఉండేదని, కానీ దేశంతో పాటు ప్రపంచంలో ఇప్పుడు కార్మిక వర్గం దాడికి గురవుతున్నదని తెలిపారు. ఇటీవలి కర్ణాటకలో ఫ్యాక్టరీస్ చట్టాన్ని సవరించి, పని గంటలను పెంచారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పని గంటలు పెంచుతూ 2020లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. పని గంటలు మాత్రమే కాకుండా, సంఘం పెట్టుకొనే హక్కు వంటి అన్ని కార్మిక హక్కులు దాడికి గురవుతున్నాయని పేర్కొన్నారు. తమ లాభాలను రక్షించుకునేందుకు, సంక్షోభాల నుండి బయటపడేందుకు కార్మిక హక్కులపై దాడి తప్ప మరొక మార్గం లేదని పెట్టుబడిదారీ వర్గం భావిస్తోందని అన్నారు. యూరప్, లాటిన్ అమెరికా, అమెరికా, పారిస్, ఫ్రాన్స్, ఆఫ్రికాతో సహా ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. మన దేశంలో కూడా కార్మికులు పోరాట బాట పట్టారని, కార్మికులే కాకుండా రైతులు కూడా ఉద్యమిస్తున్నారని తెలిపారు. హక్కుల పరిరక్షణ, ఎనిమిది గంటల పని వంటి డిమాండ్లపై పోరాటాలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటాలు కేవలం డిమాండ్ల సాధన కోసమే కాదని, పెట్టుబడిదారీ వ్యవస్థ విధానాలు మార్పు కోసమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు జెఎస్ మజుందర్, అమితవ్ గుహ, ఆర్.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలోని పి రామ్మూర్తి భవన్‌లో అఖిలభారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ఆధ్వర్యాన జరిగిన మేడే పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య నిర్వహించారు.

ప్రత్యామ్నాయ ప్రజానుకూల విద్యా విధానం

- రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇవ్వాలి
- 'సేవ్ ఎడ్యుకేషన్, సేవ్ నేషన్' నినాదంతో నేషనల్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి)కి ప్రత్యామ్నాయ ప్రజానుకూల విద్యా విధానం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని నేషనల్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ పిలుపు ఇచ్చింది. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ విద్య, ఆధునిక, సాంస్కృతికంగా విభిన్నమైన, సమానమైన, స్వావలంబన కలిగిన ఆర్థిక వ్యవస్థను, సమాజంలో ప్రజల సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుందని పేర్కొంది. ఎన్‌ఇపి పేద, దళిత, గిరిజన, మైనార్టీ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను దూరం చేస్తోందని, దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. 'సేవ్ ఎడ్యుకేషన్, సేవ్ నేషన్' నినాదంతో హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కెఎస్) భవన్‌లో ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్‌ఎన్), భారత్ జ్ఞాన్ విజ్ఞాన సమితి (బిజివిఎస్) సంయుక్తంగా నేషనల్ ఎడ్యుకేషన్ అసెంబ్లీ నిర్వహించాయి. ఎస్‌ఎఫ్‌ఐ, ఎస్‌టిఎఫ్‌ఐ, ఐద్వా, ఎఐడిఎస్‌ఒ, ఎఐఎఫ్‌యుసిటిఒ, డిటిఎఫ్, ఎఫ్‌ఇడిసియుటిఎ, జెఎన్‌యుటిఎ, ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్, ఎఐఎస్‌ఇసి, ఎఐఎఫ్‌ఆర్‌టిఇ, జెఎసి, జెఎఫ్‌ఎంఇ, ఆర్‌టిఇ ఫోరం తదితర సంఘాలు మద్దతు ఇచ్చాయి. ఈ సమావేశం ఎన్‌ఇపి, దాని అవాంఛనీయ లక్షణాలను తిప్పికొట్టడానికి, ప్రగతిశీల, ప్రజా అనుకూల ప్రభుత్వ విద్యా వ్యవస్థ కోసం పనిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, మద్దతును కోరింది.

విద్యను సరుకుగా మార్చే వాహనంగా ఎన్‌ఇపి : ఆర్ బిందు

ఈ అసెంబ్లీని ప్రారంభిస్తూ విద్యను వర్గీకరించడానికి, సరుకుగా మార్చడానికి ఒక వాహనంగా ఎన్‌ఇపి పనిచేస్తుందని కేరళ ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్ బిందు విమర్శించారు. కార్పొరేట్ శక్తులతో, మతోన్మాద శక్తులు చేతులు కలుపుతున్న ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్‌ఇపిని చూడాలని అన్నారు. దేశంలోని సమాఖ్య సూత్రాలను నిరాకరిస్తూ కేంద్రీకరణను విధించాలని ఎన్‌ఇపి స్పష్టం చేస్తుందన్నారు. ఎన్‌ఇపిని పార్లమెంటరీ పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. 'ఒక విద్యా విధానం గత విధానం డాక్యుమెంట్ల ప్రభావాలు, మెరిట్‌లు, లోపాలను పరిశీలించాలి. కానీ ఎన్‌ఇపి గత విధానం డాక్యుమెంట్ల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు' అని బిందు విమర్శించారు. రాష్ట్రం, దాని ప్రజల నిర్దిష్ట అవసరాలకు సరిపోయే ఉన్నత విద్యా నమూనాతో ఎన్‌ఇపిని నిరోధించడం కేరళలో చేస్తున్నామని బిందు చెప్పారు. యుజిసి మాజీ ఛైర్మన్, ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే మంచి అవకాశాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. సమానత్వం, అందరికీ విద్యపై నూతన విద్యా వ్యవస్థలో ఎటువంటి ప్రతిపాదనలు లేవని అన్నారు.

ఢిల్లీ యూనివర్సిటీ మాజీ డీన్, ప్రొఫెసర్ అనిత రామ్‌పాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యను దూరం చేసే విధానమే ఎన్‌ఇపి అని పేర్కొన్నారు. ఎన్‌యుఇపిఎ మాజీ వైస్ ఛాన్సలర్ ఎన్‌వి వర్గేశ్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యా వ్యవస్థను మార్కెట్‌గా, విద్యను సరుకుగా ఎన్‌ఇపి చూస్తుందని విమర్శించారు.

కార్పొరేట్లకు అనుసంధానం చేసే వ్యవస్థను ఇప్పుడు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి మాట్లాడుతూ.. దేశ ప్రజలకు మంచి భవిష్యత్తు ఇచ్చే విద్యా విధానం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐపిఎస్‌ఎన్ ప్రధాన కార్యదర్శులు సత్యజిత్ రాత్, ఆశా మిశ్రా, ఎఐపిఎస్‌ఎన్ కోశాధికారి ఎస్‌ఆర్ ఆజాద్, శాస్త్రవేత్త డి రఘునందన్, బిజివిఎస్ ప్రధాన కార్యదర్శి కాశ్‌నాథ్ ఛటర్జీ, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జెఎన్‌యుటిఎ అవినాష్ మిశ్రా, జెఎఫ్‌ఎంఇ ఛైర్‌పర్సన్ నందితా నారాయణ్, ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్, సహాయ కార్యదర్శులు డినిత్ డెంటా, నితీష్ నారాయణ్ మాట్లాడారు. వివిధ సాంస్కృతిక బృందాలు నృత్య ప్రదర్శన చేయగా, మరికొన్ని బృందాలు గీతాలాపన చేశాయి. నూతన విద్యా విధానంపై షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలను ప్రదర్శించారు.

మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు, వడగళ్లు

న్యూఢిల్లీ : రానున్న మూడు రోజులపాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు, వడగళ్ల వానలు కురుస్తాయని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. తమిళనాడు, కేరళ, దక్షిణ కర్ణాటక, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ హిమాలయ ప్రాంతం, మధ్యప్రదేశ్‌లో మే 3 వరకు భారీ వర్షాలు, వడగళ్ల వానలు కురుస్తాయని భారత వాతావరణశాఖ (ఐఎండి) తెలిపింది. వర్షం కారణంగా వివిధ రాష్ట్రాల్లో సాధారణం కంటే అనేకస్థాయిల ఉష్ణోగ్రత తగ్గిందని, రాబోయే నాలుగు రోజుల్లో ఎక్కడా హీట్‌వేవ్ పరిస్థితులు ఏర్పడే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మే 5 నుంచి వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టడానికి ముందు దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. బుధవారం వరకు అనేక రాష్ట్రాల్లో ఉరుములు, బలమైన గాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఆ తర్వాత వర్షాలు తగ్గనున్నాయని వాతావరణ శాఖ సూచించింది."దేశంలోని చాలా ప్రాంతాలలో ఉరుములతో కూడిన వర్షం మే 3 వరకు కొనసాగుతుంది. మే 4 నుంచి గణనీయంగా తగ్గుతుంది" అని ఐఎండి పేర్కొంది. ఈ వర్షాలకు వాయువ్య భారతదేశం ఎక్కువగా ప్రభావితమవుతుందని ఐఎండి శాస్త్రవేత్త నరేష్ కుమార్ అన్నారు. గత నెలలో వాతావరణ కార్యాలయం తన వార్షిక సూచనలో వర్షాకాలంలో సాధారణ వర్షపాతం నమూనాను అంచనా వేసింది. సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం 67 శాతం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

కాంగ్రెస్‌లో బిజెపి గిరిజన నేత సాయి చేరిక

రాయ్‌పూర్: బిజెపికి చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు నంద్‌కుమార్ సాయి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఛత్తీస్‌ఘఢ్, అంతకుముందు మధ్యప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా కూడా పనిచేసిన సాయి... ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన ప్రతిష్టను దిగజారుస్తున్నారని, బిజెపిలో తనపై కుట్రలు జరుగుతున్నాయని ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా సాయి మాట్లాడుతూ బిజెపిని విడిచిపెట్టడం తనకు కఠినమైన నిర్ణయమని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని భూపేష్ బఘేల్ ప్రభుత్వం చేపట్టిన నర్వా గర్వా ఘుర్వా బడి (రైతుల కోసం ఒక ప్రధాన పథకం), తదితర పథకాలు తనకు నచ్చి, ఆ పార్టీలో చేరుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కూడా పాల్గొని ఆయనకు పార్టీలోకి స్వాగతం పలికారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు నెలరోజుల ముందు సాయి బిజెపికి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం.

'దేశద్రోహం'పై చర్చిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

దేశద్రోహ నేరానికి సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ కసరత్తు పూర్తయ్యే వరకు ఈ నిబంధన కింద పెండింగ్‌లో ఉన్న అన్ని విచారణల దర్యాప్తు కొనసాగించొద్దని, బలవంతపు చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశానుసారం దేశద్రోహ కేసుల్లో అండర్ ట్రయల్ ఖైదీలుగా జైలుల్లో ఉన్న చాలా మంది వ్యక్తులకు వివిధ కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. దీనిపై కేంద్రం తన అభిప్రాయాన్ని తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతేడాది మేలో సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఈ చట్టాన్ని పున పరిశీలించేందుకు మరింత గడువు కావాలని కేంద్రం గతేడాది అక్టోబర్ 31న కోరింది. సవరించిన చట్టాన్ని వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

"ప్రభుత్వం పట్ల అసంతృప్తిని" తెలిపినందుకు ఐపిసి సెక్షన్ 124ఎ ప్రకారం గరిష్టంగా జీవిత ఖైదు విధించే దేశద్రోహం, 1890లో అంటే స్వాతంత్ర్యానికి 57 ఏళ్ల ముందు, ఐపిసి ఉనికిలోకి వచ్చిన దాదాపు 30 ఏళ్ల తరువాత శిక్షాస్మృతిలోకి చేర్చబడింది. స్వాతంత్ర్యానికి పూర్వం, మహాత్మా గాంధీ, బాలగంగాధర తిలక్‌తో సహా స్వాతంత్ర్య సమరయోధులపై ఈ సెక్షన్‌ను బ్రిటీష్‌వారు ప్రయోగించారు. ఇటీవలి కాలంలో రచయిత్రి అరుంధతీ రాయ్, విద్యార్థి కార్యకర్త ఉమర్ ఖలీద్, జర్నలిస్ట్ సిద్ధిక్ కప్పన్‌లతో సహా పలువురిపై మోడీ ప్రభుత్వం ఈ దేశద్రోహ చట్టాన్ని మోపింది.





మీకోసం

వాత సమస్యలతో బాధపడేవారు దాల్చిన చెక్కను ఎండబెట్టి పొడి చేసుకుని వేడి పాలల్లో ఒక చెంచా వేసుకుని రోజూ తాగాలి.

జీవన సౌరభం

మంచి వ్యక్తిగా ఉండండి. అయితే దానిని నిరూపించుకునేందుకు సమయాన్ని వృథా చేయకండి..

గొప్ప - ముప్ప




గర్రగూడెం అటవీ ప్రాంతంలో టేకు, ఇప్ప చెట్లు మధ్య ఓ రోజు గొడవ అయ్యింది. 'నా కలప తోనే ప్రజలు అనేక వస్తువులు తయారు చేసుకుంటారు, నా పూలను బతుకమ్మను పేర్చడానికి వాడతారు' అని కొమ్మలు ఊపుతూ టేకు చెట్టు గట్టిగా అంది.

'ఆగు నీ గొప్ప? నా పూలను గిరిజన ప్రాంతంలో ప్రత్యేకంగా ఏరుతారు. ఉపాధి పొందుతారు. నా పూల నుంచి రసం తీసి సుగంధ ద్రవ్యాల్లో, ప్రయోగశాల్లో, సారాయి దీపాలకి ఉపయోగిస్తారు. నా పూలని రామాలయంలో ప్రసాదంగా కూడా పెడతారు. చెట్టు కాయల్లోని గింజల నుంచి తీసిన ఇప్ప నూనె పూజల్లో భక్తిగా పోస్తారు' అని ఇప్ప చెట్టు చెప్పసాగింది.

'ఓహో .. నా కలపని దేవాలయాల్లో ధ్వజస్తంభంగా పెడతారు. అని టేకు చెట్టు వాదనకు దిగింది. కొంత సమయం తర్వాత కట్టెలు కొట్టుకునే వాళ్లు అడవికి వచ్చారు. ఆ చెట్లను కొట్టడానికి గొడ్డళ్లు తీసుకొచ్చి కొట్టసాగారు. అంతే! టేకు చెట్టు భయంతో వణికిపోయింది. ఇప్పచెట్టు కూడా దెబ్బలకు తట్టుకోలేక ఏడ్వసాగింది.

ఈ కష్టం నుంచి ఎలా బయటపడాలా అని బాధపడసాగాయి. అంతలోనే అటవీ అధికారులు వాహనంలో వచ్చారు. దాంతో కట్టెలు కొట్టే వాళ్లు పారిపోయారు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాయి. మనం గొప్పలు చెప్పుకుంటున్నాం కానీ మనకి ముప్పు వస్తే కాపాడుకోలేకపోయాం. అంది టేకు చెట్టు. 'అవునవును నిజమే మిత్రమా!' అని ఇప్ప చెట్టు అంది. ఆ రోజు నుంచీ చెట్లు రెండూ గొప్పలు చెప్పుకోవడం మానుకున్నాయి.

- అమ్మిన వెంకట అమ్మిరాజు
94407 08656



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



- సి.ధరణి,
3వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఫొటోగ్రఫీలో రాణించేలా..

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. కొన్ని రంగాల్లో మాత్రం వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రమే.. ఉదాహరణకు ఫొటోగ్రఫీలో రాణిస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువ. ఈ విషయమే చెన్నై ఫొటోగ్రాఫర్ అమర్ రమేష్‌ను ఆలోచనలో పడేసింది. చాలా ఏళ్ల క్రితం తమిళనాడు వ్యాప్తంగా పలు వర్క్‌షాపులు, చర్చా కార్యక్రమాలు నిర్వహించినప్పుడు 300 మంది వరకు హాజరైతే వారిలో ఒకరు, ఇద్దరు మాత్రమే మహిళలు ఉండడం అతన్ని తీవ్రంగా కలిచివేసింది. అప్పుడు అతను తీసుకున్న ఓ నిర్ణయం గత మూడేళ్లుగా మంచి ఫలితాలు రాబడుతోంది. తన స్టూడియో 'ఎ', చెన్నై ఫొటో బైన్నెల్ (సిపిబి) ఫౌండేషన్‌తో సంయుక్తంగా ఫొటోగ్రఫీలో లింగ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు మూడేళ్లుగా శక్తివంచన లేకుండా ఆయన చేస్తున్న కృషి చూద్దాం ..



'మహిళలు మహిళలుగా గుర్తించబడాలి. వారి భాగస్వామ్యం తక్కువగా ఉన్న ప్రాంతాల నుండే ఆ గుర్తింపు మొదలవ్వాలి. అందుకే తమిళనాడు వ్యాప్తంగా చిన్న పట్టణాలు, దిగువ-మధ్య తరగతి వర్గాలను మా ప్రాజెక్టుకు ఎంచుకోవాలనుకున్నాం' అంటున్న రమేష్ 'కనవు' (తెలుగులో దానర్థం కల) పేరుతో 2021లో ఓ ప్రాజెక్టు ప్రారంభించారు. వెనుకబడిన వర్గాల మహిళలు, గృహిణులు, గ్రాడ్యుయేట్లు, ఇంటికే పరిమితమైన తల్లులతో కెమెరాలతో తమ కథలను పంచుకునేలా చేశారు. 'మేము శిక్షణ ఇచ్చిన మహిళల్లో ఇప్పుడు చాలామంది సొంతంగా డాక్యుమెంటరీలు చేస్తున్నారు. వివాహ కార్యక్రమాలకు వీడియోలు తీస్తున్నారు. నవజాత శిశువు ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు' అంటూ గర్వంగా చెబుతున్నారు రమేష్.

పాప ఫొటోలు.. ప్రొఫెషనల్‌గా..

'కనవు' బృందంతో కలవడం వల్ల నేను ఇప్పుడు మా జిల్లాల్లోనే ఉత్తమ నవజాత శిశువు ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నాను. పెళ్లయిన తరువాత గతంలో చేసే ఉద్యోగాన్ని వదిలేశాను. పాప పుట్టాక పూర్తి సమయం ఇంటికే పరిమితమైంది. అయితే నాకొక డిజిటల్ కెమెరా ఉండేది. దాంతో మా పాప ఫొటోలను తీసేదాన్ని. యూట్యూబ్ వీడియోలు చూసి ఇంకా మెరుగ్గా ఎలా తీయాలో నేర్చుకునేదాన్ని. నా పనితనం నచ్చి నా స్నేహితులు కూడా వారి పిల్లల ఫొటోలు తీయించుకునేవాళ్లు. అయితే ఎప్పుడైతే 'కనవు' ప్రాజెక్టులో భాగమయ్యానో.. అప్పటి నుండి నేను నా ఫొటోగ్రఫీని వృత్తిగా మొదలుపెట్టి ఆదాయం పొందుతున్నాను' అంటూ చెబుతోంది 33 ఏళ్ల చాందిని.

సినిమాలు, ఫొటోగ్రఫీలో ఇప్పటికీ మహిళలు రాణించడం లేదు. ఆ వ్యత్యాసాన్ని చిన్న పట్టణాలకు చెందిన, అట్టడుగు వర్గాల మహిళలతో నింపడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకంగా పనిచేస్తుంది' అంటున్న గాయత్రి రమేష్ ప్రోత్సాహంతో 2012 నుండే ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నారు.

ఇలా ఎంపిక చేస్తారు..

2021లో ప్రారంభమైన 'కనవు' ప్రాజెక్టులో ఏడాదికి 50 మంది మహిళలను బహిరంగ ఫోన్‌కాల్ ద్వారా సంప్రదిస్తారు. వారిలో కులం, ఆర్థికంగా అత్యంత దిగువ వర్గాలకు చెందిన ఐదుగురు మహిళలను ఫెల్లోషిప్ కోసం ఎంపిక చేస్తున్నారు. రమేష్ చేస్తున్న కృషికిగాను ప్రోగ్రామ్‌కు కావాల్సిన కెమెరాలు, ఇతర పరికరాలను ఆర్‌ఆర్ డొన్నెల్లి, ఫొటో సౌత్ ఏసియా అందిస్తున్నాయి. ఇంకా నిపుణులతో శిక్షణ ఇప్పిస్తూ ఫొటోగ్రఫీ ప్రపంచంలోకి ఆ మహిళలను సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. ప్రాథమిక శిక్షణతో ప్రారంభించి ఫొటోగ్రఫీ, ఫిల్మ్ మేకింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం పొందేలా చేస్తున్నారు. ఏడాది శిక్షణా కాలం పూర్తయిన తరువాత ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, ఫోర్టిఫోలియో డెవలప్‌మెంట్‌లో మంచి నైపుణ్యంతో ఇక్కడి మహిళలు బయటికి వస్తున్నారు. శిక్షణా కాలంలోనే వారికి నచ్చిన రంగాల్లో.. ఫొటో జర్నలిజం, ఫ్యాషన్, వాణిజ్య ప్రకటనలు, డాక్యుమెంటరీల్లో ఎలా రాణించాలి, ఆ నెట్‌వర్క్‌లో ఉపాధి ఎలా పొందాలో కూడా ఒక పాఠ్యాంశంలా బోధిస్తున్నారు.

చూసే దృష్టి మారింది..


ఇక్కడికి రాకముందు స్థానిక ప్రదేశాలు, వ్యక్తుల గురించి ఏమాత్రం అవగాహన లేని మహిళలు శిక్షణ పూర్తయిన తరువాత తమ ప్రాంతాన్ని, అక్కడి వ్యక్తులను డాక్యుమెంటరీ రూపంలో తీస్తున్నారు. మత్స్యకారులు, ఆదివాసీల జీవన విధానాలను హైలైట్ చేస్తున్నారు' అంటున్నారు రమేష్.


ఈ ఏడాది జూన్ నుండి 'కనవు' మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. మొదటి సంవత్సరం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై అవగాహన కల్పించారు. రెండో ఏడాది బయటి స్టూడియోల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సోషల్‌మీడియాపై పట్టు సాధించేలా మహిళలను సిద్ధంచేస్తున్నారు.

ఉపాధి మార్గంగా..

'శిక్షణ పూర్తయిన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. కావాల్సిన పరికరాలు ఉచితంగా అందిస్తున్నాం. మా మొదటి బ్యాచ్ విద్యార్థి చెన్నై దక్షిణ చిత్ర హెరిటేజ్ మ్యూజియంలో పూర్తికాల ఫొటోగ్రాఫర్‌గా ఉపాధి పొందింది. మరొకరు ఓ ప్రముఖ టెక్స్‌టైల్‌లో ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్నారు. అలాగే సెకండ్ బ్యాచ్ విద్యార్థి సౌందర్య మగేష్‌కుమార్ తన ప్రాంతాన్ని డాక్యుమెంట్ చేయడంలో తీరిక లేకుండా గడుపుతోంది. మడ అడవులు, సముద్ర గవ్వల ఉత్పత్తుల పరిచయం చేస్తూ ఆమె చేసిన డాక్యుమెంటరీలు సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. 'సాధారణ కుటుంబాలకు చెందిన ఈ మహిళలు, ఒకప్పుడు తమ ఆదాయమార్గంగా కుట్టుమిషను, టీచర్ వృత్తిని ఎంచుకునేవారు. కాని ఇప్పుడు ఆ ధోరణిలో మార్పు వచ్చింది. కెమెరాతో కూడా ఆదాయం ఎలా సంపాదించుకోవచ్చో నేర్చుకుంటున్నారు.

ఈ ప్రయాణం ఇంకా ముందుకు సాగుతుంది. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు తమను తాము నిరూపించుకుంటూ ఎంతోమందికి ఆదర్శంగా నిలవాలి. రాబోయే రోజుల్లో ఈ మహిళలు కెమెరాతో అద్భుతాలు సృష్టించాలి. స్టూడియో ఉద్యోగాల్లో రాణించాలి. పూర్తి నిడివి గల సినిమా తీసే సామర్థ్యం రావాలి' అని ఆశిస్తున్నారు రమేష్.











టాక్సీ డ్రైవర్‌గా చిరు

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'భోళాశంకర్' సినిమా చేస్తున్నాడు. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో షూటింగ్ చివరిదశలో ఉంది. మే డే సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌లను రిలీజ్ చేసింది. చిరు కార్మికుడి కాస్ట్యూమ్‌లో టాక్సీ దగ్గర స్టిల్స్ అదిరిపోయాయి. యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ చిరుకు చెల్లెలిగా నటిస్తుంది. తమన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. ఆగస్టు 11న థియేటర్లో విడుదల కానుందని మేకర్స్ తెలిపారు. సినిమాను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, క్రియేటివ్ కమర్షియల్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ మూవీ తమిళంలో సూపర్ హిట్టయిన 'వేదాళం'కు రీమేక్‌గా తెరకెక్కుతుంది.

ఆశిష్ బర్త్‌డే పోస్టర్




టాలీవుడ్ నిర్మాత శిరీష్ కొడుకు ఆశిష్ హీరోగా 'సెల్ఫిష్' సినిమాలో నటిస్తున్నాడు. విశాల్ కాశీ దర్శకుడిగా పరిచయమవుతూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. సోమవారం ఆశిష్ రెడ్డి బర్త్‌డే సందర్భంగా మేకర్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. రంగురంగుల కాస్ట్యూమ్‌లో దిల్‌పై చేయి పెట్టుకుని మురిసిపోతున్న హీరోని చూసి ప్రేక్షకులు శుభాకాంక్షలు తెలిపారు. దిల్‌కుష్ సాంగ్ ప్రోమోను కూడా రిలీజ్ చేశారు. సుకుమార్ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేతో పాటు సహ నిర్మాతగా ఉన్నారు. హీరోయిన్‌గా ఇవానా నటిస్తుంది. షూటింగ్ చివరిదశలో ఉన్న సినిమాను ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

4న మెలోడి సాంగ్



యంగ్ హీరో సుధీర్ బాబు ప్రస్తుతం 'మామా మశ్చీంద్రా'. రిలీజైన టీజర్ సినిమాపై మంచి అంచనాలే నెలకొల్పింది. ఇందులో సుధీర్ బాబు త్రిపాత్రాభినయం చేస్తున్నాడు. అందులో ఒకటి లడ్డుబాబు లాంటి గెటప్‌లో కనిపించడంతో ఎక్కడలేని హైప్ క్రియేట్ అయింది. కమెడియన్ హర్షవర్ధన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. జూన్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకు మేకర్స్ ఇప్పటి నుంచే ప్రమోషన్లు జరుపుతున్నారు. ఇందులో 'గాలుల్లోనా..' అంటూ సాగే మెలోడి పాటని మే 4న రిలీజ్ చేస్తున్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సుధీర్ బాబుకు జోడీగా ఈషా రెబ్బా, మృణాళిని రవి నటిస్తున్నారు. శ్రీవెంకటేశ్వరా సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చైతన్య భరద్వాజ్ సంగీతం అందిస్తున్నాడు.

క్రిష్-4 వచ్చేస్తుంది..!



20ఏళ్ల క్రితం' కోయి మిల్‌గయా' సినిమాతో క్రిష్ ఫ్రాంఛైజీ మొదలైంది. రాకేష్ రోషన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హృతిక్ రోషన్ హీరోగా నటించాడు. అప్పట్లో సంచలనమే సృష్టించింది. మళ్లీ ఏడేళ్ల తర్వాత క్రిష్ ఫ్రాంఛైజీలో రెండు, మూడు పార్టులు విడుదలైయ్యాయి. ఇవి విజయంతో పాటు, దాదాపు రూ.400 కోట్ల కలెక్షన్‌లు సాధించి తిరుగులేని విజయం సాధించింది. ఇక దీనికి కొనసాగింపుగా నాలుగో పార్టు వస్తుందని ప్రచారం జరుగుతుంది. వచ్చే ఏడాది సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు తెలుస్తుంది. అయితే నాలుగో పార్టును హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ కాకుండా అగ్నిపథ్ ఫేం కరణ్ మల్హోత్రా దర్శకత్వం వహించనున్నాడు. సిద్ధార్థ్ ఆనంద్‌తో కలిసి రాకేష్ రోషన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'విమానం' అనసూయ

సంతోష్ కట దర్శకత్వంలో అనసూయ కీలక పాత్రలో నటిస్తున్న 'విమానం' చిత్రం నుండి మేడే సందర్భంగా ఆమె లుక్‌ను మేకర్స్ విడుదలచేశారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. మీరా జాస్మిన్, సముద్రఖని ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 9న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



వర్షంతో బ్యాటర్లకు కష్టాలు షురూ!

లక్నోపై 18పరుగుల తేడాతో బెంగళూరు గెలుపు



లక్నో: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచాడు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 15.2 ఓవర్లలో 93 పరుగులు చేసిన దశలో భారీ వర్షం కురవడం మ్యాచ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఆ తర్వాత మ్యాచ్ ప్రారంభమైనా.. బెంగళూరు బ్యాటర్స్ పరుగులు రాబట్టేందుకు కష్టాలు పడాల్సి వచ్చింది. దీంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులే చేయగల్గింది. ఛేదనలో లక్నోకు ఆదినుంచే కష్టాలు మొదలయ్యాయి. పరుగుల ఖాతా తెరవకుండానే మయర్స్(0) పెవీలియన్‌కు చేరగా.. జట్టు స్కోర్ 27పరుగులకు చేరేసరికి టాపార్కర్ నలుగురు బ్యాటర్స్ ఔటయ్యారు. కృనాల్(14), స్టొయినీస్(13), గౌతమ్(23) రెండంకెల స్కోర్ చేశారు. ఈ క్రమంలో బెంగళూరు బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లక్నో జట్టు 66పరుగులకే చేరేసరికి 7వికెట్లు కోల్పోయి ఓటమి ఖాయం చేసుకుంది. చివరి ఓవర్ వరకు పోరాడి 108పరుగులే చేసి పరాజయాన్ని చవిచూసింది. దీంతో బెంగళూరు జట్టు 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. హేజిల్‌వుడ్, కరణ్ శర్మకు రెండేసి, సిరాజ్, మ్యాక్స్‌వెల్, హసరంగ, హర్షల్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

కేఎల్ రాహుల్‌కు గాయం..

ఫీల్డింగ్ చేస్తున్న లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తొడ కండరాలు పట్టేయడంతో మైదానంలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. బౌండరీ వెళ్లే బంతిని ఆపేందుకు పరుగెడుతూ ఒక్కసారిగా నొప్పితో విలవిల్లాడిపోయాడు. దీంతో కెఎల్ రాహుల్‌ను మైదానం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు స్ట్రక్చర్‌ను తీసుకురాగా.. ఫిజియో, ఇతర సిబ్బంది సాయంతో మైదానాన్ని వీడాడు.

స్కోర్‌బోర్డు...

బెంగళూరు ఇన్నింగ్స్: విరాట్ కోహ్లి (స్టంప్)పూరన్ (బి)రవి బిష్ణోయ్ 31, డుప్లెసిస్ (సి)కృనాల్ పాండ్యా (బి)అమిత్ మిశ్రా 44, అనుజ్ రావత్ (సి)మయర్స్ (బి)గౌతమ్ 9, మ్యాక్స్‌వెల్ (ఎల్‌బి)రవి బిష్ణోయ్ 4, ప్రభుదేశాయ్ (సి)గౌతమ్ (బి)అమిత్ మిశ్రా 6, దినేశ్ కార్తీక్ (రనౌట్) యశ్ ఠాకూర్ 16, లామ్రోర్ (ఎల్‌బి) నవీన్- ఉల్-హక్ 3, హసరంగ (నాటౌట్) 8, కరణ్ శర్మ (సి)గౌతమ్ (బి)నవీన్-ఉల్-హక్ 2, మహ్మద్ సిరాజ్ (సి)పూరన్ (బి)నవీన్-ఉల్-హక్ 0, హేజిల్‌వుడ్ (నాటౌట్) 1, అదనం 2. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 126పరుగులు. **వికెట్ల పతనం:** 1/62, 2/75, 3/80, 4/0, 5/109, 6/114, 7/117, 8/121, 9/121 **బౌలింగ్:** కృనాల్ 4-0-21-0 స్టొయినీస్ 1-0-11-0, నవీన్ 4-0-30-3, బిష్ణోయ్ 4-0-21-2, మిశ్రా 3-0-21-2, యశ్ ఠాకూర్ 2-0-12-0, కృష్ణప్ప గౌతమ్ 2-0-10-1.

లక్నో ఇన్నింగ్స్: మయర్స్ (సి)అనుజ్ రావత్ (బి)సిరాజ్ 0, బడోనీ (సి)కోహ్లి (బి)హేజిల్‌వుడ్ 4, కృనాల్ పాండ్యా (సి)కోహ్లి (బి)మ్యాక్స్‌వెల్ 14, దీపక్ హుడా (స్టంప్)దినేశ్ కార్తీక్ (బి)హసరంగ 1, స్టొయినీస్ (సి)ప్రభుదేశాయ్ (బి)కరణ్ శర్మ 13, పూరన్ (సి)లామ్రోర్ (బి)కరణ్ శర్మ 9, కృష్ణప్ప గౌతమ్ (రనౌట్) సోను యాదవ్/కార్తీక్ 23, రవి బిష్ణోయ్ (రనౌట్) హర్షల్/కార్తీక్ 5, అమిత్ మిశ్రా (సి)కార్తీక్ (బి)హర్షల్ పటేల్ 19, నవీన్ (సి)కార్తీక్ (బి)హేజిల్‌వుడ్ 13, కేఎల్ రాహుల్ (నాటౌట్) 0, అదనం 7. (19.5ఓవర్లలో ఆలౌట్) 108 పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/19, 3/21, 4/27, 5/38, 6/65, 7/66, 8/77, 9/103, 10/108 **బౌలింగ్:** సిరాజ్ 3-0-24-1, హేజిల్‌వుడ్ 3-0-15-2, మ్యాక్స్‌వెల్ 1-0-3-1, హసరంగ 3-0-20-1, కరణ్ శర్మ 4-0-20-2, హర్షల్ పటేల్ 3.4-0-20-1, లామ్రోర్ 1-0-4-0.

ఐపిఎల్‌లో నేడు..
గుజరాత్ × ఢిల్లీ
(వేదిక: అహ్మదాబాద్; రా.7.30గం॥లకు)

తదుపరి లక్ష్యం టాప్-4

సాత్విక్-చిరాగ్ మనోగతం



దుబాయ్: తమ తదుపరి లక్ష్యమని టాప్-4లో చోటు దక్కించుకోవడమే ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ డబుల్స్ ఛాంపియన్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తెలిపారు. ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను నెగ్గిన అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టాప్-4 ర్యాంక్‌లో నిలవడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని, రాబోయే టోర్నమెంట్‌లలోనూ రాణించిన ఒలింపిక్స్ బెర్త్‌ను నేరుగా సాధిస్తామని చెప్పుకొచ్చారు. సాత్విక్ సాయిరాజ్ మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, అయినా ఈ టోర్నమెంట్‌లో ఆ సవాళ్లనన్నింటినీ అధిగమించి విజేతగా నిలిచేందుకు కృషిచేశాడని చిరాగ్ శెట్టి తెలుపగా.. తామిద్దరి మధ్య మంచి అవగాహన ఉందని, చిరాగ్ శెట్టి మంచి భాగస్వామి అని సాత్విక్ సాయిరాజ్ పొగడ్తలతో ముంచెత్తాడు. తన గాయాల కారణంగానే గతంలో కొన్ని టోర్నమెంట్లు ఓడిపోయామని, అయినా చిరాగ్ శెట్టి భాగస్వామి మార్పును కోరుకోలేదన్నాడు. అలాగే కోచ్ మథియాస్ బాయ్‌కు వీరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫిజియో స్పెషలిస్ట్‌తోపాటు, మొత్తం సహాయ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కోచ్ మథియాస్ మాట్లాడుతూ.. టైటిల్ విజేతగా నిలిచే క్రమంలో రెండు, మూడు గేమ్‌లలో ఓ దశలో వెనుకబడ్డారని, అయినా ఏమాత్రం నిగ్రహం కోల్పోకుండా అద్భుతంగా పుంజుకొని విజేతగా నిలిచారని కొనియాడు. ఒలింపిక్ బెర్త్ సాధించేంత వరకు వీరు సేఫ్ జోన్‌లో లేనట్లేనన్నారు. టాప్-16లో నిలకడగా చోటు దక్కించుకోవడం శుభ పరిణామమని కోచ్ తెలిపారు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ స్వర్ణ పతకం కైవసం చేసుకొని నయా చరిత్ర నెలకొల్పిన సంగతి తెలిసిందే. 1971లో దీపు ఘోష్-రమన్ ఘోష్ జంట కాంస్య పతకమే నెగ్గింది.

ఆసియా క్రీడల శిక్షణనుంచి వైదొలిగిన సైనా నెహ్వాల్

న్యూఢిల్లీ: రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల ఛాంపియన్ సైనా నెహ్వాల్ త్వరలో జరగనున్న ఆసియా క్రీడల శిక్షణనుంచి తప్పుకుంది. ఫిట్‌నెస్ సమస్యే కారణంగా రాబోయే ఆసియా క్రీడల జాతీయ బ్యాడ్మింటన్ సెలెక్షన్ ట్రయల్స్ నుంచి పాల్గొనడం లేదని ట్విట్టర్ వేదికగా సైనా నెహ్వాల్ పేర్కొంది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) ఈనెల 4నుంచి 7వరకు తెలంగాణలోని జ్వాలా గుత్తా అకాడమీలో శిక్షణ నిర్వహించనుంది. బాయ్ కార్యదర్శి సంజయ్ మిశ్రా సోమవారం ఓ ప్రకటనలో సైనా నెహ్వాల్‌తోపాటు పురుషుల డబుల్స్ జోడీ కుశాల్ రాజ్, ప్రకాశ్‌రాజ్ కూడా ట్రయల్స్ నుంచి వైదొలిగినట్లు తెలిపారు. రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత పివి సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్, డబుల్స్ జోడీ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్, మహిళల డబుల్స్ జంట త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్‌తో పాటు బి డబ్ల్యుఎఫ్ టాప్-20 ఉన్న ఆటగాళ్లు నేరుగా ఆసియా క్రీడలకు నేరుగా అర్హత సాధించనున్నారు. ఇక గ్వాంఝూ వేదికగా సెప్టెంబర్ 23, అక్టోబర్ 8మధ్య ఆసియా క్రీడలు జరగనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68